విశాఖపట్టణం
మంగళవారం 23 జూన్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:150 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool



## ఉద్దవ్ సేన ఖతమ్

షిండే పార్టీలోకి 9 మంది ఎంపీలు

2

# 3 ఎస్ ఫార్ములా

## అభివృద్ధి కోసం అనుసరిస్తున్నాం

రాష్ట్ర రూపురేఖలు మారుస్తాం

2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే టార్గెట్

రిపబ్లిక్ టీవీ సమ్మిట్‌లో మంత్రి నారా లోకేశ్





(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఢిల్లీ వేదికగా జరిగిన 'రిపబ్లిక్ టీవీ సమిట్ 2026'లో ఆంధ్రప్రదేశ్ ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొని రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్ర రూపురేఖలను మార్చేందుకు అత్యంత వేగంగా అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ప్రధాన విజన్ అని లోకేశ్ వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల సృష్టే ధ్యేయంగా ప్రభుత్వం అహర్నిశలూ శ్రమిస్తోందని చెప్పారు. పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఏపీ '3ఎ' ఫార్ములాను అందిస్తోందని పేర్కొన్నారు. 'మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత వేగంగా పనులు పూర్తి కావాలని కోరుకునే ఒక 'స్పీడ్ బాస్'. ఆయన వేగానికి తగ్గట్టుగానే యంత్రాంగం పనిచేస్తోంది. ప్రస్తుతం దేశంలోకి వస్తున్న మొత్తం విదేశీ పెట్టుబడులలో 25 శాతం వాటా ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే వస్తుండటం మా ప్రభుత్వ సమర్థతకు నిదర్శనం' అని లోకేశ్ ప్రకటించారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణంపై లోకేశ్ ప్రత్యేకంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు కేవలం ప్రారంభమేనని, అమరావతి ఒక 'సెల్ఫ్-ఫైనాన్సింగ్ ప్రాజెక్ట్' అని స్పష్టం ..మిగతా 2లో



## వైసీపీ కుట్రల పార్టీ

ప్రతీ అంశం రాజకీయమే

కులం, మతం రంగులు పులిమే కుతంత్రం

తప్పుడు ప్రచారాలు, విద్వేషాలే వారి లక్ష్యం

పీజీఆర్ ఎస్ ఆర్జీలను మానవత్వంతో పరిష్కారం

సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు

ఆర్టీజీఎస్ సమీక్షలో అధికారులకు ఆదేశం

(అమరావతి - జయజయహే)

పీజీఆర్ఎస్ అర్జీలను మానవీయ కోణంలో పరిష్కరించాలని అధికారులకు సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. ఈరోజు(సోమవారం) రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. అర్జీదారుల స్థానంలో ఉండి ఫిర్యాదులను పరిష్కరించే దిశగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఉద్యోగులు, అధికారులు సాఫ్ట్ స్కిల్స్ అలవరచుకోవాలన్నారు. వినూత్న ఆలోచనలతో పని చేసే విధంగా ప్రోత్సహిస్తామన్నారు. పనితీరు ఆధారంగానే బాధ్యతలు అప్పగిస్తామని ..మిగతా 2లో

## తుంగభద్రలో మహాఘట్టం

33 క్రెస్ట్ గేట్లు ప్రారంభానికి శ్రీకారం

రికార్డు సమయంలో అద్భుత ఆవిష్కరణ

25న ప్రారంభానికి చంద్రబాబు, డీకే, రేవంత్ హాజరు

(అమరావతి - జయజయహే)



రాజకీయాల్లో అత్యంత అరుదైన, చారిత్రాత్మక ఘట్టానికి కృష్ణానది ఉపనది అయిన తుంగభద్ర వేదిక కాబోతోంది. గతేడాది చోటుచేసుకున్న ఒక ఊహించని జల విపత్తును సవాల్‌గా తీసుకున్న ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు.. రికార్డు సమయంలో డ్యామ్ రూపురేఖలనే మార్చేశాయి. కేవలం ఒకే ఒక్క ఆఫ్-సీజన్ వ్యవధిలోనే జలాశయానికి ఉన్న మొత్తం 33 క్రెస్ట్ గేట్లను అత్యంత విజయవంతంగా పునరుద్ధరించాయి. ఈ ..మిగతా 2లో

## వర్చువల్‌గా హాజరైన అల్లు అర్జున్

సంధ్యా థియేటర్ లో తొక్కిసలాట కేసు

హాజరైన అందరు నిందుతులు

(హైదరాబాద్ - జయజయహే)



హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన కేసులో సినీనటుడు అల్లు అర్జున్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయమూర్తి ఎదుట విచారణకు హాజరయ్యారు. తనకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. ఇందుకు కోర్టు అనుమతించడంతో వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. ఈ కేసుకు సంబంధించి ఇవాళ కోర్టుకు హాజరుకావాలని 19 మంది నిందితులకు ఇటీవల నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో నిందితులంతా న్యాయమూర్తి ..మిగతా 2లో



## పోలీసుల అదుపులో దువ్వాడ

పవన్‌పై వ్యాఖ్యలపై గతంలో కేసు

నోటీసులు జారీ చేసి విచారణ చేస్తున్న పోలీసులు

పోలీసు స్టేషన్ బయట దివ్వెల మాధురి హంగామా

(శ్రీకాకుళం - జయజయహే)

ఉత్తరాంధ్ర రాజకీయాల్లో నిరంతరం వార్తల్లో నిలిచే ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఆయన సహచరిణి దివ్వెల మాధురి జోడీ.. తాజాగా శ్రీకాకుళం జిల్లా కొత్తూరు పోలీస్ స్టేషన్ వేదికగా మరోసారి హల్‌చల్ చేశారు. ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై గతంలో దువ్వాడ శ్రీనివాస్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల కేసులో విచారణ నిమిత్తం పోలీసులు ..మిగతా 2లో

## రంగంలోకి సిట్

సాయికృష్ణ మిస్సింగ్‌పై సమగ్ర విచారణ

సీఐ నాగరాజు సుదీర్ఘ విచారణ

సీసీటీవీ ఫుటేజీ, డీవీఆర్, ఎన్ వీఆర్‌లు కోర్టుకు




(విజయవాడ - జయజయహే)

విజయవాడలో తీవ్ర సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ మిస్సింగ్ కేసుపై సమగ్ర విచారణ జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ విభాగం ఐజీ ఎం.రవిప్రకాశ్‌ను ఈ సిట్ చీఫ్‌గా నియమించింది. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, అల్లూరి సీతా రామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, బాపట్ల జిల్లా అదనపు ఎస్పీ ఎల్.సుధాకర్‌లను సిట్ సభ్యులుగా చేర్చుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. అయితే సీఐ నాగరాజును అరెస్ట్ చేస్తారని ఆదివారం ప్రచారం జరగగా, మరోవైపు ఆయనకు మద్దతుగా స్థానికంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. సాయికృష్ణ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కృష్ణలంక మాజీ సీఐ ఎస్.ఎస్.వి.వి నాగరాజుపై అక్రమ నిర్బంధం, కస్టడీలో వేధింపులు, ఆధారాలు మాయం చేయడం, ..మిగతా 2లో

## ఇక వర్షాలే..!

నాలుగు రోజుల పాటు వానలు

బారీ నుంచి అతి భారీగా కురిసే ఛాన్స్

రుతుపవనాల్లో చురుకు

2



# తుంగభద్రలో మహోఘట్టం

మొదటి పేజీ తరువాయి...

ఇంజనీరింగ్ అద్భుతాన్ని ఆవిష్కరిస్తూ.. జూన్ 25న మునిరాబాద్ కొప్పల్ వద్ద నిర్వహించబోయే తుంగభద్ర నూతన గేట్ల ప్రారంభోత్సవ వేడుక కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. ఈ మేరకు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడిని అధికారికంగా ఆహ్వానించేందుకు కర్ణాటక ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సోమవారం ఏపీ సచివాలయానికి వచ్చింది. గతేడాది ఆగస్టు 10న అర్ధరాత్రి జరిగిన ఘోర ప్రమాదం కారణంగా తుంగభద్ర డ్యామ్ 19వ నంబర్ క్రెస్ట్ గేట్ చైన్ లింక్ తెగిపోవడంతో.. వరద ఉధృతికి ఆ గేట్ కొట్టుకుపోయింది. ఆ సమయంలో జలాశయం నుంచి దాదాపు 35,000 క్యూసెక్కుల నీరు వృధా అయింది. దీంతో రాయలసీమ, కర్ణాటక రైతాంగంలో తీవ్ర గుండెకోత మిగిలింది. ఆ క్లిష్ట పరిస్థితుల్లో ఏపీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అక్కడే మకాం వేయగా.. సుప్రసిద్ధ నిపుణుడు కన్నయ్యనాయుడు బృందం యుద్ధప్రాతిపదికన శ్రమించి తాత్కాలిక స్టాప్-లాక్ గేటును అమర్చింది. దాంతో దాదాపు 80 టీఎంసీల నీటిని కాపాడగలిగారు. అయితే డ్యామ్ గేట్లు 70 ఏళ్ల క్రితం నాటివి కావడం, వాటి కాలపరిమితి ముగిసిపోవడంతో.. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా మొత్తం 33 గేట్లను మార్చాలని తుంగభద్ర బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ భారీ ప్రాజెక్టును అహ్మదాబాద్‌కు చెందిన హార్డ్‌వేర్ టూల్స్ అండ్ మెషినరీ ప్రాజెక్ట్ లిమిటెడ్ సంస్థకు సుమారు రూ. 51 కోట్ల వ్యయంతో అప్పగించారు. గతేడాది డిసెంబర్ 24న పాత గేట్ల తొలగింపు ప్రక్రియ ప్రారంభం



కాగా.. కేవలం 123 రోజుల రికార్డు కాలంలోనే, అంటే ఈ ఏడాది ఏప్రిల్ 25 నాటికే కొత్త గేట్ల అమరిక పూర్తి చేసి సరికొత్త రికార్డు సృష్టించారు. వర్షాకాలం ప్రారంభమై పశ్చిమ కనుమల నుంచి వరద నీరు జలాశయానికి వచ్చేలోపే ఈ పనులన్నీ పూర్తి చేశారు. దీనివల్ల రాబోయే సీజన్‌లో పూర్తి స్థాయిలో 105 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునేందుకు డ్యామ్ సురక్షితంగా సిద్ధమైంది. జూన్ 25న జరగబోయే ఈ భారీ నూతన గేట్ల ప్రారంభోత్సవ వేడుక కేవలం ఒక ప్రాజెక్ట్ ఓపెనింగ్ మాత్రమే కాదు.. మూడు రాష్ట్రాల ఉమ్మడి ప్రయోజనాల వేదికగా మారనుంది. కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌తో పాటు కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిలు సంయుక్తంగా ఈ వేడుకలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాలు, తుంగభద్ర జలాశయ నీటి భాగస్వామ్యం, నవలి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఏర్పాటుపై ముగ్గురు సీఎంలు ఒకే వేదికపై చర్చించే అవకాశం ఉందని కర్ణాటక వర్గాలు తెలిపాయి. ఈ 33 కొత్త గేట్ల ఏర్పాటుతో.. ఇటు కర్ణాటకలోని బళ్లారి, కొప్పల్, రాయచూర్, విజయనగర జిల్లాలే కాకుండా.. అటు రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లోని సుమారు 7.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు శాశ్వత సాగునీటి భద్రత లభించనుంది. తెలంగాణలోని మహబూబ్‌నగర్ పరిధిలోని ఆయకట్టుకు సైతం ఊరట లభించనుంది. దశాబ్దాల కాలపరిమితి ముగిసిన డ్యామ్ గేట్లను మార్చడం ద్వారా రాబోయే 50-60 ఏళ్ల పాటు రైతులకు నీటి ధోకా లేకుండా భద్రత కల్పించినట్లయింది. ప్రమాదాన్ని అవకాశంగా మార్చుకుని, రికార్డు టైమ్‌లో ఈ ప్రాజెక్టును పూర్తి చేయడంపై ఇరు రాష్ట్రాల రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.



# ఇక వర్షాలే..!

**నాలుగు రోజుల పాటు వానలు**

**భారీ నుంచి అతి భారీగా కురిసే ఛాన్స్**

**రుతుపవనాల్లో చురుకు**

**(అమరావతి - జయజయహే)**

ఉభయ తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. నైరుతి రుతుపవనాలు, ద్రోణి ప్రభావం కారణంగా తెలంగాణలో ఐదురోజులు, ఏపీలో నాలుగు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఏపీ సరిహద్దు జిల్లాలైన నల్లగొండ, సూర్యాపేటకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. నైరుతి రుతుపవనాలు రేపటి కల్లా విస్తరిస్తాయని పేర్కొంది. ఇక ఏపీలోనూ ఈ నెల 26వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఉంటాయని, 40 నుంచి 50కి.మీ. వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాష్ట్రంలో ఈ నెల 23 నుంచి 26 వరకు ఉత్తర కోస్తా, కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ, అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉత్తర కోస్తాలో ఈ నెల 23 నుంచి 26 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని సూచించింది. అదే విధంగా భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశం ఉంది. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని హెచ్చరిక జారీ చేసింది. కోస్తాలో ఈ నెల 23 నుంచి 26 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందని సూచించింది. ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అదే విధంగా ఉరుములతో కూడిన మెరుపులు సంభవించే అవకాశం ఉందని వెల్లడించింది. ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాయలసీమలో ఈ నెల 23 నుంచి 26 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం , భారీ వర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉంది. ఒకటీ రెండు చోట్ల ఉరుములతో కూడిన మెరుపులు సంభవించే అవకాశం ఉందని, ఈదురు గాలులు గంటకు 40 నుంచి 50కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని హెచ్చరిక జారీ చేసింది. మూడు ప్రాంతాల్లో ఈ నెల 27, 28 రెండు రోజుల్లో వాతావరణ హెచ్చరిలు ఏమీ లేదని స్పష్టం చేసింది.

# వైసీపీ కుట్రల పార్టీ

మొదటి పేజీ తరువాయి...

స్పష్టం చేశారు. ప్రజలతో వ్యవహరించే సమయంలో సౌమ్యంగా, మర్యాదపూర్వకంగా ఉండాలని సూచించారు. దీనివల్ల పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని తెలిపారు. మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ఉద్యోగులు తమ సామర్థ్యాలను ఎప్పటికప్పుడు పెంచుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో కుట్రలు పన్నే పార్టీలు ఉన్నాయని సీఎం వ్యాఖ్యానించారు. ప్రతి అంశాన్ని రాజకీయం చేయడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. కులం, మతం రంగులు పులిమి.. వాటిని వివాదాస్పద అంశాలుగా సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఫేక్ ప్రచారాల ద్వారా ఉద్యోగులు, అధికారులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తప్పుడు ప్రచారాలను, విద్వేషాలు పెంచే ఘటనలను అదుపు చేసేలా ఉద్యోగులు, అధికారులు అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. ఇటీవల కాలంలో మానసిక సమస్యల కారణంగా కూడా కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారని సీఎం పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయిలకు అలవాటుపడి తప్పుదారి పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2019లో జరిగిన కొన్ని నేరాలను ఇప్పుడు ట్రేస్ చేసి నిందితులను పట్టుకుని శిక్షలు విధిస్తున్నామని తెలిపారు. ఇలాంటివి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. తప్పు చేసినవారు ఎప్పటికీ తప్పించుకోలేరని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.



# వర్చువల్‌గా హాజరైన అల్లు అర్జున్

మొదటి పేజీ తరువాయి...

ఎదుట హాజరై బాండ్లపై సంతకాలు చేశారు. అనంతరం కేసు విచారణను న్యాయమూర్తి జులై 6కి వాయిదా వేశారు. ఈ కేసులో అల్లు అర్జున్‌ను చిక్కడపల్లి పోలీసులు ఏ11 గా చేర్చారు. ఏ1 నుంచి ఏ10 వరకు సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని నిందితులుగా పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే 23 మంది నిందితులపై ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. 2024 డిసెంబర్ 4న బెనిఫిట్ షో కోసం సంధ్య థియేటర్ వద్ద వేలాది మంది అభిమానులు, ప్రేక్షకులు గుమిగూడారు. అదే సమయంలో హీరో అల్లు అర్జున్ స్వయంగా థియేటర్‌కు వస్తున్నారనే సమాచారంతో ఒక్కసారిగా అక్కడ వాతావరణం అదుపు తప్పింది. అభిమానులు ఒకేసారి లోపలికి దూసుకెళ్లేందుకు ప్రయత్నించడంతో ఘోరమైన తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో థియేటర్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించిన రేవతి అనే మహిళ ఊపిరాడక అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకున్న చిక్కడపల్లి పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టారు. థియేటర్ వద్ద భద్రతా లోపాలు, ముందస్తు అనుమతులు, జనం రద్దీని నియంత్రించడంలో విఫలమవడం వంటి అంశాలపై ఆధారాలు సేకరించారు. ఈ కేసులో 23 మందిని నిందితులుగా చేరుస్తూ నాంపల్లి కోర్టులో పోలీసులు ఛార్జిషీట్ దాఖలు చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించడంలో నిర్లక్ష్యం వహించినందుకు గానూ సంధ్య థియేటర్ యాజమాన్యాన్ని ప్రధాన నిందితులుగా చేర్చారు. జనం భారీగా తరలివచ్చే అవకాశం ఉందని తెలిసి కూడా సరైన జాగ్రత్తలు, ముందస్తు సమాచారం లేకుండా థియేటర్‌కు రావడం ద్వారా తొక్కిసలాటకు కారణమయ్యారనే ఆరోపణలతో హీరో అల్లు అర్జున్‌ను ఏ-11గా పోలీసులు కేసులో చేర్చారు. పోలీసులు సమర్పించిన ఛార్జిషీట్‌ను పరిశీలించిన నాంపల్లి కోర్టు, ఈ కేసులో ప్రాథమిక ఆధారాలను బట్టి మొత్తం 23 మంది నిందితులకు సమన్లు జారీ చేసింది. సోమవారం నాడు నిందితులంతా తప్పనిసరిగా కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాలని ఇటీవల స్పష్టం చేసింది. దీంతో నేడు అల్లుఅర్జున్ ఆన్‌లైన్‌లో విచారణకు హాజరు కాగా, మిగతా నిందితులంతా వ్యక్తిగతంగా హాజరయ్యారు.

# రంగంలోకి సిట్

మొదటి పేజీ తరువాయి...

హత్యానేరం తదితర తీవ్రమైన ఆరోపణలపై ఇదివరకే కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను సిట్‌కు అప్పగిస్తూ దర్యాప్తుకు అవసరమైన అదనపు సిబ్బందిని, ఫోరెన్సిక్‌తో పాటు శాస్త్రీయ, సాంకేతిక సహాయాన్ని తీసుకునే అధికారాన్ని సిట్‌కు కల్పించారు. కృష్ణలంక స్టేషన్‌కు సంబంధించిన కెమెరాల దృశ్యాలు నమోదైన హార్డ్‌డిస్క్, డీవీఆర్, ఎన్‌వీఆర్‌లను ఫోరెన్సిక్ బృందం సోమవారం నాడు కోర్టుకు సమర్పించనుంది. గత మూడు రోజులుగా క్షేత్రస్థాయిలో సేకరించిన కీలక వివరాలు, విచారణ నివేదికను ఏసీపీ దైవప్రసాద్ నేతృత్వంలోని సిట్ అధికారులకు ఆదివారం సమర్పించింది. ఈ కేసులో సేకరించిన కీలక ఆధారాలు, సాక్ష్యులతో పాటు పోలీసుల స్టేట్మెంట్లను నివేదిక రూపంలో ఏసీపీ సిట్ హెడ్‌క్వార్టర్స్‌కు అందించారు. ఏసీపీ దైవప్రసాద్ సమర్పించిన ఈ ప్రాథమిక నివేదికపై సిట్ చీఫ్ రవి ప్రకాష్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని ప్రత్యేక బృందం అందించిన టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా జూన్ 22 నుంచి పూర్తిస్థాయిలో సిట్ విచారణ జరపనుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆదివారం విజయవాడ చేరుకుని సిట్ బృందం దర్యాప్తును మొదలుపెట్టింది. సిట్ బృందంలోని సభ్యుడైన బాపట్ల అదనపు ఎస్పీ సుధాకర్ ఆదివారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ కార్యాలయంతో పాటు కృష్ణలంక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి వివరాలు సేకరించారు. ప్రస్తుతం ఈ కేసును విచారిస్తున్న ఏసీపీ దైవప్రసాద్ బృందంతో భేటీ అయి, ఇప్పటివరకు సేకరించిన దర్యాప్తు వివరాలను పరిశీలించారు. విజయవాడ పోలీసుల నుంచి కేసు ఫైల్, స్టేట్మెంట్స్ రికార్డులను సిట్ స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఐ నాగరాజును సిట్ అధికారులు సోమవారం ప్రశ్నించారు.



# 3 ఎస్ ఫార్ములా

మొదటి పేజీ తరువాయి...

చేశారు. ప్రస్తుతం రూ.60,000 కోట్ల నిధుల సమీకరణతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీకి ఇచ్చిన మాట ప్రకారం.. 2028 నాటికల్లా అమరావతి కోర్ క్యాపిటల్ భవనాలను సిద్ధం చేస్తామని అన్నారు. ఢిల్లీ రాజకీయాల్లో ఏపీ ప్రాధాన్యాన్ని ప్రస్తావిస్తూ.. 'ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ కూటమిలో ఏపీ నుంచి ఎక్కువ మంది ఎంపీలు ఉండటం వల్ల దేశ రాజధానిలో ఏపీ గొంతు ఎంతో బలంగా వినిపిస్తోంది' అని లోకేశ్ అన్నారు.



# ఉద్ధవ్ సేన ఖతమ్

**షిండే పార్టీలోకి 9 మంది ఎంపీలు**

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

మహారాష్ట్ర రాజకీయాల్లో కొన్ని రోజులుగా కొనసాగుతున్న సస్పెన్స్‌కు తెరపడింది. ఉద్ధవ్ సేనకు చెందిన 9 మంది ఎంపీల్లో ఆరుగురు రాష్ట్ర డిప్యూటీ సీఎం ఏకనాథ్ షిండే సారథ్యంలోని శివసేనలో చేరారు. ఓంరాజే నింబాల్కర్, సంజయ్ పాటిల్, సంజయ్ జాదవ్, సంజయ్ దేశముఖ్, నాగేశ్ పాటిల్ ఆష్టికార్, భావుసాహేబ్ వాక్చౌరే ఏక్‌నాథ్‌తో జట్టుకట్టారు. ఇటీవలే, బెంగాల్‌లోని 20 మంది టీఎంసీ ఎంపీలు పార్టీని వీడి నేషనలిస్టు సిటిజన్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఉద్ధవ్ సేన రెబల్ వర్గం ఎంపీలు తమ పార్టీలో చేరడంపై ఏక్‌నాథ్ షిండే హర్షం వ్యక్తం చేశారు. 'అసలైన పులులు ఇక్కడకు వచ్చేశాయి. అసలైన శివ సేన కుటుంబంలో వారు భాగమయ్యారు. వారికి సాదర స్వాగతం పలుకుతున్నాను' అని అన్నారు. ఆపరేషన్ టైగర్ ముగిసిందని వ్యాఖ్యానించారు. రెబల్ ఎంపీలు దురంధర్‌లు అంటూ ఇటీవలి బాలివుడ్ హిట్ సినిమా ప్రస్తావన కూడా తెచ్చారు. షిండే 2022లో తొలిసారిగా తిరుగుబాటు బావుటా ఎగరవేయడంతో శివసేన రెండుగా చీలిపోయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఉద్ధవ్ సేన ఎంపీ సంజయ్ రౌత్‌కు కూడా డిప్యూటీ సీఎం చురకలంటించారు. తమ వద్దే ముగ్గురు సంజయ్‌లు ఉన్నారని, ఇక మరే సంజయ్ గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. ఈ ఆరుగురు ఎంపీల నియోజకవర్గాల్లో నిధులకు, అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తామని కూడా హామీ ఇచ్చారు.



# పోలీసుల అదుపులో దువ్వాడ

మొదటి పేజీ తరువాయి...

నోటీసులు జారీ చేయడంతో వీరిద్దరూ పీఎస్‌కు హాజరయ్యారు. పోలీస్ స్టేషన్ లోకి మాధురీని అనుమతించలేదు. పోలీసులు ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను గదిలో కూర్చోబెట్టి లీగల్ విచారణ జరుపుతుండగా.. బయట మాత్రం మాధురి నిరసనలు చేస్తూ హడావుడి చేశారు. పోలీస్ స్టేషన్ గేటు వద్దే నిలబడి సోషల్ మీడియా కెమెరాల సాక్షిగా సంచలన వ్యాఖ్యలు చేశారు. "ఈ జిల్లాలో పోలీసులకు మరే క్రైమ్‌లు దొరకలేదా.. మా ఆయనే దొరికాడా? దువ్వాడ శ్రీనివాస్‌కి ఏమైనా అయితే నేను చూస్తూ ఊరుకోను.. మా ఆయన్ని ఇంతలా హింసిస్తున్న వారిని అసలు వదలను" అంటూ ఆమె హెచ్చరికలు జారీ చేశారు. ఎప్పుడో పాత ఫిర్యాదును పట్టుకుని ఇప్పుడు విచారణకు రమ్మనడం వెనుక పూర్తి రాజకీయ కక్షసాధింపు ఉందంటూ మాధురి ఆరోపించారు. "మా ఆయన చేసింది తప్పైతే, పవన్ కల్యాణ్ చేసింది తప్పు కాదా? పవన్ కల్యాణ్ మా నేత వైఎస్ జగన్‌ను ఎలా పడితే అలా తిట్టొచ్చు.. కానీ మా శ్రీను మాత్రం పవన్‌ను తిట్టకూడదా? అంటూ ప్రశ్నించారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని సార్లు విచారణకు పిలిచినా తాము తగ్గేదే లేదంటూ పోలీసుల ముందే ఓపెన్ చాలెంజ్ విసిరారు. ఒకవైపు దువ్వాడ శ్రీనివాస్ లోపల పోలీసుల ప్రశ్నలకు చట్టపరంగా సమాధానాలు చెప్పుకుంటుంటే, బయట మాధురి క్రియేట్ చేసిన ఈ భారీ డైలాగుల షో మాత్రం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్‌గా మారింది. రాజకీయ విమర్శలను వ్యక్తిగత స్థాయికి తీసుకెళ్లడమే కాకుండా, పోలీస్ స్టేషన్ పరిధిలో ఇలాంటి సీన్లు క్రియేట్ చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## యువ భారత స్ఫూర్తి కోసం
# డా.గజల్ జెన్ జి తెలుగు గజల్ల గానం

**విశాఖపట్నం:(జయ జయహే )**

ప్రఖ్యాత గజల్ గాయకుడు, ట్రిపుల్ గిన్నీస్ ప్రపంచ రికార్డుల గ్రహీత డా. గజల్ శ్రీనివాస్ తన గజల్ గానానికి ఓ సరికొత్త ఒరవడిని అందించే దిశగా ముందడుగు వేస్తున్నారు. గజల్ చారిటబుల్ ట్రస్ట్ మరియు విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో, జూన్ 24, 25, 26 తేదీలలో ప్రతి రోజు ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, విశాఖపట్నంలోని కళాభారతి వేదికగా "జెన్ జి తెలుగు గజల్లు" కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. యువ భారత స్ఫూర్తిని మేల్కొలిపే లక్ష్యంతో, మానవతా విలువలు, మానవ సంబంధాల పట్ల గౌరవం, మరియు ప్రగతిపథంలో యువత దూసుకుపోయే దిశగా ప్రేరణనిచ్చే భావాలతో ఈ గజల్ల గానం సాగనుంది. ముఖ్యంగా నేటి తరం యువతకు ఆలోచన, ఆవేశం, బాధ్యత, సంస్కారం, సృజనాత్మకత కలగలిపిన సందేశాన్ని అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని యువతకు అంకితం చేస్తున్నట్లు డా. గజల్ శ్రీనివాస్, విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్, కళాభారతి అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్. రాజు, కార్యదర్శి శ్రీరామదాసడా. గుమ్మలూరి రామకృష్ణ ప్రసాద్ (రాంబాబు )వెల్లడించారు. ఇదే స్ఫూర్తితో దేశవ్యాప్తంగా ఇలాంటి మరెన్నో సృజనాత్మక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించే సంకల్పం ఉన్నట్లు డా. గజల్ శ్రీనివాస్ తెలిపారు.






## గౌతమి ఘాట్‌లో
# కొలువుదీరనున్న వీరభద్రుడు

### 24న ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**రాజమహేంద్రవరం: జయ జయహే**

జూన్ 22:నగరంలోని గౌతమి ఘాట్, అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రుడి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఈనెల 24న వైభవంగా జరగనుంది. ఈ మేరకు శ్రీ ధర్మశాస్త్ర ఆధ్యాత్మిక కేంద్రం చైర్మన్ జక్కంపూడి విజయలక్ష్మి సోమవారం మీడియాకు వివరాలు వెల్లడించారు.ఆలయ నిర్మాణదాతలు మన్యం వీర వెంకట సత్యనారాయణ మూర్తి (బాబ్జి) - సునీత దంపతుల చేతుల మీదుగా బుధవారం ఉదయం 8.46 గంటలకు ప్రతిష్ట మహోత్సవం జరగనుంది.మహాబలిపురం నుంచి ప్రత్యేకంగా తెప్పించిన వీరభద్రుడి ఏకశిలా విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. దుష్టశక్తులను పారదోలే దైవంగా వీరభద్రుడిని భక్తులు కొలుస్తారు.24న విగ్రహ, శిఖర ప్రతిష్టా కార్యక్రమాలు, 25న చాంబర్ ఆఫ్ కామర్స్ హాల్‌లో స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం మరియు అదే రోజున అన్న సమారాధన నిర్వహిస్తారు.పదేళ్ల నాటి తన సంకల్పం నెరవేరడం ఆనందంగా ఉందని మన్యం వీర వెంకట సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఆయన గతంలో తిరుపతి, షిరిడి, కాశీ క్షేత్రాల్లో కూడా సత్రాల నిర్మాణంలో సేవలందించారని ట్రస్టీ చల్లా శంకర్రావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోలసానిపల్లి హనుమంతరావు, ఇమ్మంది మోహన్ రావు, చలపతి గురుస్వామి, మంతెన కేశవ రాజు, పిచ్చుక సత్యనారాయణ, దౌలూరి రామకృష్ణ, బూరుగుపల్లి శేషారావు, మన్యం ప్రవీణ్ - వినీల, మన్యం నవీన్ - జ్యోతి దంపతులు తదితరులు పాల్గొన్నారు.



## జాబ్ మేళా గోడ పత్రిక
# ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**చోడవరం జూన్ 22 జయ జయహే**

చోడవరం ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఈనెల 25 న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. సుమారు 18 కంపెనీలతో నిర్వహించబోయే మెగా జాబ్ మేళా గోడ పత్రికను సోమవారం ఎమ్మెల్యే ఏ ఎస్ ఎన్ ఎస్ రాజు చోడవరశీ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఇంటర్వ్యూలకు పదవ తరగతి, ఐ టి ఐ, డిప్లొమా, డిగ్రీ పి జి వరకు చదువుకొని 18 నుండి 35 సంవత్సరముల వయస్సు గల యువతీ, యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చున్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ రోహిణి ప్లేసెమెంట్ అధికారి వంశీ పాల్గొన్నారు. కావున ఆసక్తి కలిగిని నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరములను ఖఱఅజూబఅఖఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్ తో పాటుగా ఎక్కువ రెస్యూమేలు, ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు జెరాక్స్ లతో ఉదయం 9 గంటలకు జాబ్ మేళా జరుగు ప్రదేశానికి హాజరు కాగలరు. మరిన్ని వివరములకు 9494791935 నంబర్లను సంప్రదించగలరు.



## ప్రజాదర్బార్లో సమస్యలు స్వీకరించిన ఎమ్మెల్యే

**చోడవరం 22 జయ జయహే**

చోడవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు నియోజకవర్గం నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సమస్యలను వివరించేందుకు వచ్చిన ప్రతి ఒక్కరీ సమస్యలను తెలుసుకుని వారి సమస్యల పరిష్కారానికి తగు భరోసా ఇచ్చారు. అందిన అర్జీలన్నింటినీ పరిశీలించిన అనంతరం, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.ప్రజా సమస్యల పరిష్కారమే తమ కర్తవ్యమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## ఆహార భద్రతకు పటిష్ట చర్యలు అవసరం..

### కల్తీ నియంత్రణపై కలెక్టర్‌కు జనతా వారధి వినతి"

**రాజమహేంద్రవరం: జయ జయహే :జూన్ 22**

ఆంధ్రప్రదేశ్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ఆహార కల్తీని అరికట్టేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, ఆహార భద్రతా వ్యవస్థను పటిష్టం చేయాలని బిజెపి 'జనతా వారధి' బృందం డిమాండ్ చేసింది. సోమవారం పిజిఆర్ఎస్ లో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 'జనతా వారధి' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులలో, ఆహార భద్రతకు సంబంధించి వస్తున్న ఆందోళనకర అంశాలపై వారు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఆహార భద్రత అధికారుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ప్రతి జిల్లాలో కనీసం ఒక 'మినీ ఫుడ్ టెస్టింగ్ లేబరేటరీ'ని ఏర్పాటు చేసి, తనిఖీలను వేగవంతం చేయాలి. హోటళ్లు, రెస్టారెంట్లు, మాంసం దుకాణాల్లో ప్రతి వారం 'హైజీన్ ఇన్‌స్పెక్షన్స్'నిర్వహించాలి. అక్రమ స్లాటర్ పాయింట్లను గుర్తించి తక్షణమే మూసివేయాలి.ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు మరియు అంగన్‌వాడీ కేంద్రాల్లో సరఫరా అయ్యే ఆహారంపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి. అన్ని ఆహార వ్యాపార సంస్థల్లో 'క్యూర్ బేస్డ్ ఫుడ్ లైసెన్స్'ను బహిరంగంగా ప్రదర్శించడం తప్పనిసరిచేయాలి.నిబంధనలు పదేపదే ఉల్లంఘించే వ్యాపారులపై భారీ జరిమానాలు విధించడంతో పాటు, క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ప్రజల ఫిర్యాదుల కోసం 24ఇ7 ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి.ఈ కార్యక్రమంలో జనతా వారధి కన్వీనర్ శివరామకృష్ణరాజ, కో-కన్వీనర్ యానాపు ఏసు,స్వామి సూర్యకిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు సూర్యభాస్కర్, వీరబాబు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత బ్యూటీషియన్ శిక్షణ

**మాడుగుల జూన్ 22 జయ జయహే**



మాడుగుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ ఎస్ఎస్డిసి ఆధ్వర్యంలో ఉచిత బ్యూటీషియన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాడుగుల నియోజకవర్గ స్కిల్ డెవలప్మెంట్ అధికారి లక్ష్మయ్య సోమవారం తెలిపారు. పదో తరగతి లేదా అంతకంటే పై స్థాయి విద్య పూర్తి చేసి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల24 వ తేదీ నుంచి తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేవలం 30 సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నందున ఆసక్తి గల అభ్యర్థులు వెంటనే మాడుగుల ప్రభుత్వా జూనియర్ కళాశాలలో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు 7288007804,7981102224 ఆసక్తి గల అభ్యర్థులు పై నంబర్లను సంప్రదించి శిక్షణకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవచ్చున్నారు.

# కాపులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### జనసేన ఎమ్మెల్యే పంతం వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్సీ తోట ఖండన

### పంతం రాజీనామా చేస్తే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా తోట

**కాకినాడ, జూన్ 22 (జయ జయహే)**



ఎన్నికల్లో కూటమికి చెందిన పార్టీలు కాపుల అభివృద్ధి కోసం ఎన్నో హామీలు ఇచ్చాయని వాటిలో ఏం అమలు చేశారో బహిర్గతం చేయాలని అలాగే కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వర రావు (నానాజీ) తమపై చేసిన వ్యాఖ్యలను వైసీపీ పిఏసి సభ్యుడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఖండించారు. నానాజీ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తవుతుందని ఆయన రాజీనామా చేస్తే తాను కాకినాడ రూరల్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని తోట పేర్కొన్నారు. సోమవారం పంతం నానాజీ తనపై వ్యక్తిగతం గాను, తన స్వగృహంలో వైసీపీలోని కాపు ముఖ్య నేతలతో జరిగిన సమావేశంపై చేసిన ఆరోపణలపై తో స్పందిస్తూ స్థానికంగా ఓ హోటల్లో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావటం లేదని మీరు ఆయన్ని కుల నాయకుడని ఆయనేమో నాకు కులం లేదు అంటారంటూ గందరగోళం చేస్తున్నారని చెప్పారు. తనను భూ కబ్జాదారుడుగాను, దళితులకు గుండు కొట్టించిన వ్యక్తిగా నానాజీ చెప్పడం పట్ల తోట స్పందించారు. తాను భూకబ్జాదారుని కానని ఎటువంటి స్థలాలు ఆక్రమించానని నిరూపిస్తే నానాజీకి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తానని చెప్పారు. అలాగే దళితులు సంబంధించిన కేసులను కోర్టులో ఎదుర్కొంటున్నానని కేసులు లేకుండా బయట పడతారని చెప్పారు. తన గృహంలో సుమారు 40 ఏళ్ల రాజకీయాల్లో అనుభవం ఉన్న నాయకులు హాజరైన సమావేశమును వైసీపీ కుక్కల సమావేశం అని నానాజీ చేసిన వ్యాఖ్యలకు ఖండించారు. తాను నానాజీ కంటే ఘోరంగా మాట్లాడగలనని తనకు ఆత్మ అభిమానం అడ్డు వస్తుందని తోట అన్నారు. జనసేనలో ఉన్న కాపు ప్రజాప్రతినిధులు కలిసి డిప్యూటీ సీఎం పవన్‌ను సీఎం చేయాలని డిమాండ్ చేస్తే తాను కాపు నేతగా ఎక్కువ సంతోషపడతానని తోట అన్నారు. పార్టీలు సేవలు చేసి కాదని కులం చూసే టికెట్లు ఇస్తున్నాయని కులం ఒక బలం అని తోట అన్నారు. పవన్ మాదిరిగా తమ పార్టీ అధినేత జగన్ అసభ్యకరంగా రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయలేదని తోట చెప్పారు. రాజకీయ పార్టీగా సమావేశం ఏర్పాటు చేసుకున్నామని అది జనసేనను టార్గెట్ చేసామని మీరు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కాపుల అభివృద్ధి నిమిత్తం ఆ కార్పొరేషన్‌కు ఏడాదికి 3వేల కోట్లు ఇస్తానన్న హామీని నిలుపుకోవాలని తోట డిమాండ్ చేశారు.

# కులాల మధ్య అంతరాలు సృష్టించి రాజకీయాలు చేస్తున్న వైఎస్ఆర్సిపి భూస్థాపితం కావడం ఖాయం

**చోడవరం జూన్ 22 జయ జయహే**

ఆంధ్రప్రదేశ్ లో కులాల మధ్య అంతరాలు సృష్టించి రాజకీయం చేయాలని చూస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం కావడం ఖాయం అని జనసేన పార్టీ హెచ్చరించింది. సోమవారం చోడవరం పార్టీ కార్యాలయంలో నియోజవర్గ జనసేన పార్టీ ఇంచార్జి పివిఎస్ఎన్ఎల్ రాజు విలేకరులతో మాట్లాడుతూ రాజకీయాల్లో కులాల ప్రస్తావన తీసుకొని వచ్చి వైస్సార్సీపీ పార్టీ మరల అధికారం లోకి రావాలని, ప్రజల్లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని,సమర్ధతని ప్రజల్లో పలచన చేయాలనీ చూస్తున్నారని మండి పడ్డారు.ఒక కుత్సిత బుద్ధితో ఎప్పటికి అప్పుడు కులాల ప్రస్తావన తీసుకొని వస్తూ కులాల కుంపట్లు రాజేస్తూ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వం లోని వైయస్సార్ పార్టీ తిరిగి అధికారం చేపట్టాలనే ఆశతో అత్యంత దారుణమైన రాజకీయాలు చేయడం తీవ్ర అభ్యంతర కరమన్నారు. జగన్ మోహన్ రెడ్డి ప్రజల చేత తిరస్కరించబడి 154 సీట్లు నుంచి 11 సీట్ల కు పరిమితం అయినప్పటికీ అసెంబ్లీ సమావేశాలకి హాజరు కాకుండా ప్రజా సమస్యలు మాట్లాడకుండా ఉంటూ గుంటూరు లో ఒక యువకుడు అదృశ్యం అయితే వారి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళ్లి అక్కడ మళ్ళీ కులాల ప్రస్తావన తెస్తూ మాట్లాడడం సరైనది కాదన్నారు.అది అంబటి రాంబాబు అయినా, పేర్ని నాని అయినా ఏ స్థాయి నాయకుడు అయిన ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు అయినా కులాల ప్రస్తావన




తెచ్చి లబ్ది పొందాలి అనుకోవడం అత్యంత హేయనీయమన్నారు.పవన్ కళ్యాణ్ ఎప్పుడు ఒక్కటే చెప్తారు. జాతీయత మనకి ముఖ్యం ముందుగా మన దేశం అభివృద్ధి, మన రాష్ట్రము అభివృద్ధి మన ప్రాంతం అభివృద్ధి జరగాలి అన్నదే పవన్ కళ్యాణ్ గ విధానం,నేషన్ ఫస్ట్ దాని కోసమే పవన్ నేతృత్వం లో మేము పనిచేస్తున్నామన్నారు. దేశానికీ స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి అయ్యాయి మనం నాగరికత కలిగిన సమాజం లో ఉన్నాము అయినా సరే కులాలని అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేద్దాం అనుకోవడం సిగ్గుచేటు. నేడు మన సమాజం లో కులాంతర వివాహాలు, మతంతర వివాహాలు, ఖండాంతరం వివాహాలుజరుగుతున్న ఆధునిక సమాజం లో మనం ఉన్నాము అన్న విషయం గమనించండి. ఇంతగా సమాజం లో మార్పు కనిపిస్తున్నా వైస్సార్సీపీ నాయకులు ఇంకా కులాలని అడ్డు పెట్టుకుని రాజకీయాలకు పాల్పడం చాలా అసహ్యంగా ఉంది. కొంతమంది సీనియర్ నాయకులు మాట్లాడుతున్నారు మాకు కులం ముఖ్యం అని ఎవరు వద్దు అన్నారు అండి మీ కులాన్ని ఉంచుకోండి. పవన్ కళ్యాణ్ గారు ఏంటి అన్నారు కులాలని గౌరవించుకుందాం అన్నారు. మా పార్టీ లోనే కాదు అన్ని పార్టీలలో అన్ని కులాలు ఉంటాయి కాదనలేము కదా. కొత్త తరం యువతకి ఉపాధి విద్య ఉద్యోగం అవకాశాలు కలుగచేయమని కోరుకుంటున్నారు. అన్ని కులాల, మతాలకు చెందిన యువత పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కలుగచేయమని కోరుకుంటున్నారు. అన్ని పార్టీ లలో మనస్పర్థలు ఉంటాయి. అభిప్రాయం భేదాలు ఉంటాయి అయినప్పటికీ అంతిమంగా దేశం కోసం ఆలోచన చేయవలసిన అవసరం ఉంది తప్పిస్తే కూలాలని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయడం సిగ్గుచేటు అయిన విషయం. మీ లాంటి చవకబారు, కుంచిత మనస్తత్వం కలిగిన వ్యక్తులు సహకారం తోటే, విభజించి పాలించే మీలాంటి నాయకుల వలెనే మన దేశాన్ని బ్రిటిష్ వారు 200 సంవత్సరాలు పైబడి పరిపాలించారు. ఎంతో మంది మహానుభావులు త్యాగాలు, పోరాటాల ఫలితంగా స్వతంత్రం వచ్చింది. మీ చర్యలను. మేము ఒక రాజకీయ పార్టీగా ఖండిస్తున్నాము. మీ మొహాలు చూసి, మీరు త్యాగాలు చేసారని, సేవలు చేసారని మీకు ఎశ్రీఖ లుగా ప్రజలు ఓట్లు వేసి గెలిపించలేదు అండి. అసెంబ్లీ కి వెళ్లకుండా ఏదో తప్పుడు పనులు చేసిన వ్యక్తులని పరామర్శకి వెళ్లి వారి చర్యలను కులానికి పవన్ కళ్యాణ్ గారికి ఆపాదించడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు



# ధవళేశ్వరం మార్కెట్ ఆశీల పాట వాయిదా!

**రాజమహేంద్రవరం: జయ జయహే**

జూన్22:ధవళేశ్వరం స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం మార్కెట్ ఆశీల పాట నిర్వహించారు. సుమారు 79 మంది అభ్యర్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అయితే, ప్రభుత్వం నిర్ణయించిన ఆదాయ లక్ష్యానికి అనుగుణంగా పాట రాకపోవడంతో, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు ఆశీల పాటను నిలిపివేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్ణీత ధర లభించనందున, ఈ ఆశీల పాట ప్రక్రియను జూన్ 28, 2026 కు ఆదివారం వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.ఈ ఆశీల పాట ప్రక్రియపై స్థానిక వ్యాపారులలో ఆసక్తి నెలకొన్నప్పటికీ, ప్రభుత్వం ఆశించిన రేటు దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. వచ్చే 28వ తేదీన జరిగే ఆశీల పాటలోనైనా ఆశించిన స్థాయిలో ఆదాయం లభిస్తుందా లేదా అన్నది వేచి చూడాలి.




# లోన్ యాప్‌ల ఆగడాలను నియంత్రించాలి

(సి.హెచ్.ప్రతాప్)

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మనిషి జీవితాన్ని సులభతరం చేసినప్పటికీ, అదే సాంకేతికత కొన్నిసార్లు ప్రాణాంతకంగా మారుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా ఆన్‌లైన్ లోన్ యాప్‌ల పేరుతో జరుగుతున్న వేధింపులు సమాజంలో కొత్త ముప్పుగా మారాయి. తాజాగా హైదరాబాద్‌లో ఒక 25 ఏళ్ల యువ వివాహిత ఆత్మహత్య చేసుకుందన్న మీడియా వార్తలు రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. లోన్ యాప్ ద్వారా తీసుకున్న రుణం చెల్లింపులో జాప్యం కావడంతో నిర్వాహకులు నిరంతరం ఒత్తిడి, మానసిక వేధింపులకు గురిచేయడం వల్లే ఈ విషాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు.

ఇలాంటి ఘటనలు దేశవ్యాప్తంగా గతంలో కూడా చోటుచేసుకున్నప్పటికీ ఇప్పటికీ పూర్తి స్థాయిలో సాంకేతిక నియంత్రణ లేకపోవడం ఆందోళనకరం. అత్యవసర పరిస్థితుల్లో డబ్బు అవసరమైన సామాన్యులు, మధ్యతరగతి కుటుంబాలు సులభంగా రుణం లభిస్తుందనే ఆశతో ఈ యాప్‌లను ఆశ్రయిస్తున్నారు. అయితే చిన్న మొత్తంలో ఇచ్చే రుణాలపై భారీ వడ్డీలు విధించడం, గడువు మించగానే అసభ్యకరమైన కాల్స్ చేయడం, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం, కుటుంబ సభ్యులు మరియు స్నేహితులకు అవమానకర సందేశాలు పంపించడం వంటి చర్యలతో బాధితులను తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తున్నారు.

ఆర్థిక సమస్య కంటే మానసిక ఒత్తిడి ప్రమాదకరమై ప్రాణాలు తీస్తోంది. ముఖ్యంగా యువత, గృహిణులు, ఉద్యోగులు ఇలాంటి వేధింపులను తట్టుకోలేక తీవ్ర నిర్ణయాలకు పాల్పడుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాదు, సమాజాన్ని కలవరపెడుతున్న సామాజిక సమస్యగా మారింది.

ఈ పరిస్థితులను అరికట్టేందుకు ప్రభుత్వం, పోలీసులు, బ్యాంకింగ్ నియంత్రణ సంస్థలు మరింత కఠిన చర్యలు తీసుకోవాలి. అక్రమ లోన్ యాప్‌లపై ప్రత్యేక దర్యాప్తు నిర్వహించి వెంటనే నిషేధం విధించాలి. ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, గుర్తింపు పొందిన బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థల నుంచే రుణాలు తీసుకోవాలని సూచించాలి. సోషల్ మీడియా, టెలివిజన్, విద్యాసంస్థల ద్వారా సైబర్ ఆర్థిక మోసాలపై విస్తృత ప్రచారం అవసరం.

అలాగే కుటుంబ సభ్యులు కూడా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారిని నిర్లక్ష్యం చేయకుండా మానసిక ధైర్యం ఇవ్వాలి. సమస్య ఎంత పెద్దదైనా ప్రాణం కంటే విలువైనది కాదనే భావన సమాజంలో పెరగాలి. ఆర్థిక ఇబ్బందులు తాత్కాలికం కావచ్చు, కానీ ఆవేశంలో తీసుకునే నిర్ణయాలు కుటుంబాలను శాశ్వత విషాదంలోకి నెడతాయి.

ఇకపై ఇలాంటి విషాదాలు పునరావృతం కాకుండా సమాజం, ప్రభుత్వం, ప్రజలు కలిసి చైతన్యంతో ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# అమ్మవారికి..... 108 నిమ్మకాయల మాల!!

## కేవలం సంఖ్యా లేక నాడీ వ్యవస్థ రహస్యమా?

(పుట్టా శ్రీనివాసరావు)

అమ్మవారి ఆలయాలలో, ముఖ్యంగా ఆదివారం, మంగళవారలము, గురువారం, శుక్రవారాలలో దుర్గాదేవికి, గ్రామ దేవతలుకు నిమ్మకాయలను మాలగా కూర్చి వేయడం మనం చూస్తుంటాము. కొందరు తమ మొక్కుబడుల కోసం 108 నిమ్మకాయలతో కూడిన పెద్ద మాలలను సమర్పిస్తుంటారు.

అసలు ఈ నిర్దిష్ట సంఖ్యలోనే ఎందుకు మాల వేస్తారు?

అమ్మవారికి పండ్లను మాలగా ఎందుకు సమర్పించాలి? దీని వెనుక మన పూర్వీకులు దాచి ఉంచిన లోతైన శారీరక ఆరోగ్య శాస్త్రం ఏంటి అనే విషయాలు ప్రముఖ ఆస్ట్రాలజర్ సర్వేశ్ కోరుకొండ మాటల్లో తెలుసుకుందాం...

మానవ శరీరంలోని 108 శక్తి కేంద్రాలు:



మన పూర్వీకుల వర్మ వైద్యం,యోగ శాస్త్రం ప్రకారం, మానవ శరీరంలో నరాలు, శక్తులు అన్నీ కలిసే ముఖ్యమైన బిందువులు ఖచ్చితంగా 108 ఉన్నాయి.

**ఆధ్యాత్మిక రహస్యం:**

అమ్మవారికి సమర్పించే 108 నిమ్మకాయల మాల అనేది, ఈ విశ్వాన్నే తన శరీరంగా భావించే జగన్మాత యొక్క 108 బ్రహ్మాండ శక్తి బిందువులను సూచిస్తుంది. ఆ పండ్లు అమ్మవారిని తాకి, అక్కడ ఉండే మంగళకరమైన దివ్య కిరణాల తరంగాలను ఆకర్షిస్తాయి. ఆ తర్వాత ఆ పండ్లు మనకు లభించినప్పుడు, అవి మన శరీరంలోని 108 బిందువులను ప్రేరేపించి ఆరోగ్యాన్ని చేకూర్చే ఒక గొప్ప ఔషధంగా మారుతాయి.

**అమ్ల గుణం - ప్రతికూల తరంగాల తొలగింపు.....**

నిమ్మకాయ తొక్కలో ఉండే అవశ్యక నూనెలు , దాని పులుపు గుణానికి గాలిలో ఉండే క్రిములను, ప్రతికూల (నెగటివ్) తరంగాలను ఆకర్షించే స్వభావం ఉంది.

**శాస్త్రీయ రహస్యం: 108**

నిమ్మకాయలు ఒకే చోట చేరినప్పుడు, ఆ గర్భగుడి మొత్తం ఒక పెద్ద 'శక్తి కవచం' లాగా మారుతుంది. ఆ మాల నుండి వెలువడే మృదువైన సువాసన, గుడిలోకి వచ్చే భక్తుల మానసిక ఒత్తిడిని తగ్గించి, నరాలకు విశ్రాంతినిచ్చి, వారిని ఒక ప్రశాంతమైన ధ్యాన స్థితికి తీసుకెళ్తుంది

**భక్తి ఇచ్చే మానసిక నిబ్బరం:**

నిమ్మకాయల మాలను కూర్చడానికి ఎంతో ఓర్పు, పవిత్రమైన భక్తి అవసరం. సూదితో పండ్లను గుచ్చేటప్పుడు మన దృష్టి ఎటూ చెదరకుండా ఏకాగ్రత కుదురుతుంది.

**జీవన పాఠం:**

మన జీవితంలో ఎదురయ్యే చేదైన, పుల్లనైన అనుభవాలను (నిమ్మకాయలను) అన్నింటినీ ఒకటిగా చేర్చి,



వాటిని అమ్మవారికి మాలగా సమర్పించేస్తే... అమ్మవారు తన కృపతో వాటిని మనకు అనుకూలమైన సానుకూల (పాజిటివ్) శక్తిగా మార్చి అందిస్తుంది!

అమ్మవారికి మనం చేసే ప్రతి పూజ వెనుక మన శరీరాన్ని, మనస్సును రక్షించే ఒక గొప్ప శాస్త్రీయ సిద్ధాంతం దాగి ఉంది.ఎవరితోనూ శత్రుత్వం లేకుండా జీవించే మనుషుల మనో విచారాలను, అమ్మవారు ఆ నిమ్మకాయల మాల లాగే తనలోకి లాగేసుకుని, వారికి దివ్యమైన వెలుగును ప్రసాదిస్తుంది!

**సూలాయుధంలో నిమ్మకాయ ఎందుకు.........!!**

అమ్మవారి కరుణను చాటే విశ్వ శక్తి విజ్ఞానం!

అమ్మవారి ఆలయాలకు వెళ్లినప్పుడు మనకు మొదట ప్రసాదంగా లభించేది ఒక నిమ్మకాయే. అమ్మవారి చేతుల్లోనూ, ఆమె ఉగ్రరూపానికి ప్రతీక అయిన సూలాయుధపు (త్రిశూలం) కొనలకూ నిమ్మకాయను గుచ్చి ఉంచడం మనం చూసే ఉంటాం.

ఎన్నో రకాల పండ్లు ఉండగా, అమ్మవారికి నిమ్మకాయకే ఎందుకు ఇంతటి ప్రాధాన్యత ఇస్తారు?

మన పూర్వీకులు దీని వెనుక దాచిన ఆధ్యాత్మిక, విశ్వ శక్తి రహస్యం ఏమిటో మీకు తెలుసా?

దానికి సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన నిజాలు పరిశీలించండి

ప్రతికూల శక్తిని ఆకర్షించే అయస్కాంతం.......

ఆధునిక శక్తి విజ్ఞానం ప్రకారం, కొన్ని వస్తువులకు తమ చుట్టూ ఉన్న తరంగాలను లేదా రేడియేషన్‌ను ఆకర్షించే శక్తి ఉంటుంది.

**శాస్త్రీయ రహస్యం:**

పండ్లన్నింటిలోకి ఒక్క నిమ్మకాయకు మాత్రమే చుట్టుపక్కల ఉండే మనుషుల ప్రతికూల ఆలోచనలు, అసూయ, దిష్టి (నరదృష్టి) మరియు చెడు తరంగాలను అయస్కాంతంలా తన వైపుకు ఆకర్షించి, వాటిని నిర్వీర్యం చేసే గొప్ప ఆధ్యాత్మిక విద్యుత్-వాహకం లా పనిచేసే సామర్థ్యం ఉంది.సూలాయుధానికి ఎందుకు గుచ్చుతారు?

అమ్మవారి సూలాయుధం అనేది అపారమైన విశ్వ శక్తిని విడుదల చేసే ఒక ఆధ్యాత్మిక యాంటెన్నా లాంటిది. ఆలయానికి వచ్చే వేలాది మంది భక్తుల ఆందోళనలు, మానసిక ఒత్తిళ్లు, చెడు ఆలోచనలన్నీ అక్కడ విడుదలవుతుంటాయి.

ఆధ్యాత్మిక రహస్యం: సూలాయుధపు పదునైన కొనల నుండి వెలువడే తీవ్రమైన శక్తిని సమతుల్యం చేయడానికి, భక్తుల ప్రతికూల శక్తిని అణచివేసి ఆకర్షించడానికే దాని కొనలపై నిమ్మకాయను గుచ్చి ఉంచుతారు. ఇది ఆ ప్రాంతాన్ని స్వచ్ఛమైన సానుకూల (పాజిటివ్) శక్తి గల ప్రదేశంగా మారుస్తుంది.

మనలో ఉండే పులుపు (గుణాల ప్రతీక):

నిమ్మకాయ బయటకు చూడటానికి ఎంతో అందంగా, పసుపు రంగులో (మంగళకరంగా) ఉంటుంది. కానీ దాని లోపలి రుచి మాత్రం తీవ్రమైన పులుపు.

జీవన పాఠం: మనుషులమైన మనం కూడా బయటకు చూడటానికి మంచివారిలా నటించవచ్చు. కానీ మన లోపల అసూయ, ద్వేషం, దురాశ వంటి పుల్లని (చెడు) గుణాలను దాచి ఉంచుతాము. అమ్మవారు తన చేతిలో నిమ్మకాయను పట్టుకుని ఉండటం దేనికి సంకేతమంటే "నీలో ఉన్న చెడు గుణాలను నాకు సమర్పించు, నేను వాటిని ప్రసాదంగా మార్చి నీకు మేలు చేకూరుస్తాను" అని చెప్పడమే!

మనం గ్రహించాల్సిన తత్వం:

అమ్మవారి గుడిలో ఇచ్చే నిమ్మకాయ కేవలం ఒక పండు మాత్రమే కాదు; అది అమ్మవారి అనుగ్రహంతో సానుకూల శక్తి నింపబడిన ఒక ఆధ్యాత్మిక కవచం! దాన్ని ఇంట్లో ఉంచడం వల్ల మన చుట్టూ ఉన్న వాతావరణం పవిత్రమవుతుంది.

ఎవరితోనూ శత్రుత్వం లేకుండా, ఎవరి ముందూ చేయి చాచకుండా, ఆత్మగౌరవంతో బతకాలనుకునే వ్యక్తి మనస్సును ఎలాంటి ప్రతికూల శక్తి దరిచేరనీయకుండా అమ్మ పరాశక్తి కాపాడుతుందనడానికి ఈ నిమ్మకాయే నిదర్శనం!

# సమర్థ నాయకత్వానికి శాశ్వత సూత్రం యోగా

(సి.హెచ్.ప్రతాప్)

నేటి ప్రపంచంలో నాయకత్వం అనేది పదవి లేదా అధికారానికి పరిమితమైన భావన కాదు. వేగంగా మారుతున్న పరిస్థితుల్లో సరైన నిర్ణయాలు తీసుకోవడం, ఒత్తిడిని అధిగమించడం, బృందంలో విశ్వాసాన్ని నింపడం, సంక్షోభాలను అవకాశాలుగా మలచడం నాయకత్వానికి అసలైన ప్రమాణాలు. ఈ లక్షణాలను పెంపొందించేందుకు ఆధునిక సంస్థలు కోట్ల రూపాయలు వెచ్చించి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయితే వేల సంవత్సరాల క్రితమే భారతీయ యోగ తత్వం సమర్థ నాయకత్వానికి అవసరమైన మూల సూత్రాలను ప్రతిపాదించింది. అందుకే యోగాన్ని కేవలం ఆరోగ్య సాధనగా చూడటం దాని విస్తృత పరిమాణాన్ని తగ్గించి చూడటమే అవుతుంది.

మహాభారత యుద్ధరంగంలో అర్జునుడు నైతిక సందిగ్ధంలో చిక్కుకున్నప్పుడు శ్రీకృష్ణుడు అందించిన భగవద్గీత నాయకత్వానికి ఒక శాశ్వత మార్గదర్శక గ్రంథంగా నిలిచింది. యుద్ధాన్ని స్వయంగా నడిపించకపోయినా, ఒక నాయకుడు తన సహచరునిలో ధైర్యాన్ని ఎలా నింపాలి, లక్ష్యాన్ని ఎలా స్పష్టపరచాలి, సంక్షోభ సమయంలో ఆత్మవిశ్వాసాన్ని ఎలా పునరుద్ధరించాలి అనే విషయాలను కృష్ణుడు తన ఆచరణ ద్వారా చూపించాడు. అందుకే ఆయనను ప్రపంచంలోనే అత్యుత్తమ వ్యూహాత్మక నాయకులలో ఒకరిగా భావిస్తారు.

భగవద్గీతలోని "యోగస్థః కురు కర్మాణి" అనే సందేశం నేటి నాయకత్వానికి కూడా వర్తిస్తుంది. ఫలితాలపై భయాలు, అనిశ్చితులు, ఒత్తిళ్లకు లోనుకాకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించడమే నిజమైన నాయకత్వమని ఈ సూక్తి బోధిస్తుంది. అదే విధంగా "సమత్వం యోగ ఉచ్యతే" అనే గీతా వాక్యం విజయ--అపజయాల మధ్య సమతుల్యతను పాటించే వ్యక్తే స్థిరమైన నాయకుడిగా ఎదుగుతాడని తెలియజేస్తుంది. మార్కెట్ ఒడిదుడుకులు, సాంకేతిక మార్పులు, ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల మధ్య పనిచేసే ఆధునిక కార్పొరేట్ నాయకులకు ఈ సందేశం మరింత ప్రాసంగికంగా కనిపిస్తోంది.

పతంజలి మహర్షి "యోగశ్చిత్తవృత్తి నిరోధః" అని నిర్వచించిన యోగం మనస్సును కేంద్రీకరించే శాస్త్రం. నాయకత్వ వైఫల్యాలకు తరచుగా కారణమయ్యేది సమాచారం కొరత కాదు; చిత్త స్థిరత్వం లోపించడమే. ఆవేశం, భయం, అహంకారం లేదా అసహనం ప్రభావంతో తీసుకునే నిర్ణయాలు సంస్థలను సంక్షోభంలోకి నెట్టగలవు.



యోగం, ధ్యానం, ప్రాణాయామం వంటి సాధనలు నాయకుడిలో ఏకాగ్రతను, సహనాన్ని, వివేచనను పెంపొందిస్తాయి. అందుకే ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రముఖ సంస్థలు తమ నాయకత్వ అభివృద్ధి కార్యక్రమాల్లో యోగం, మైండ్‌ఫుల్‌నెస్ సాధనలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి.

స్వామి వివేకానంద "ఏకాగ్రతే శక్తి" అని పేర్కొన్నారు. ఒక నాయకుడి విజయం కూడా అతని ఏకాగ్రతపైనే ఆధారపడి ఉంటుంది. అనేక అవకాశాలు, సవాళ్లు, ప్రలోభాల మధ్య సంస్థ లక్ష్యాన్ని మరువకుండా ముందుకు నడిపించగల సామర్థ్యం యోగ సాధన ద్వారా బలపడుతుంది. అదే కారణంగా ప్రపంచంలోని పలువురు ప్రముఖ వ్యాపార నాయకులు ధ్యానాన్ని తమ దైనందిన జీవితంలో భాగం చేసుకున్నారు.

ఆధునిక నిర్వహణ శాస్త్రం భావోద్వేగ మేధస్సు, సహానుభూతి, ఆత్మనియంత్రణ వంటి లక్షణాలను సమర్థ నాయకత్వానికి కీలకంగా పేర్కొంటోంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ లక్షణాలన్నీ యోగ తత్వంలో శతాబ్దాల క్రితమే అంతర్లీనంగా ఉన్నాయి. నాయకత్వం అనేది ఇతరులను నియంత్రించడం కాదు; ముందుగా తనను తాను నియంత్రించుకోవడమే అనే సూత్రాన్ని యోగం బోధిస్తుంది.

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మనం గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, యోగం వ్యక్తిగత ఆరోగ్యాన్ని మెరుగుపరచే సాధన మాత్రమే కాదు; సమర్థ నాయకత్వాన్ని తీర్చిదిద్దే జీవన విధానం కూడా. మహాభారతంలో శ్రీకృష్ణుడు ప్రతిపాదించిన నాయకత్వ సూత్రాలు నేడు కార్పొరేట్ బోర్డు రూమ్‌లలోనూ, ప్రజా పరిపాలనలోనూ, సామాజిక సంస్థలలోనూ సమానంగా వర్తిస్తున్నాయి. కాలం మారినా నాయకత్వానికి అవసరమైన సమతుల్యత, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, విలువల పట్ల నిబద్ధత మారవు. ఆ లక్షణాలను పెంపొందించే శాశ్వత మార్గం యోగమే.

# రేపటి భరోసా!

నిన్నటి వరకు
గడియారం కంటే ముందే లేచి
బాధ్యతలతో బయలుదేరిన అడుగులు
సాయంత్రం అలసటను భుజాన
మోసుకుంటూ
ఇంటికి చేరిన నవ్వులు.

నెలాఖరున వచ్చిన జీతంలో
ఎన్నో కలలు వాటా అడిగాయి
పిల్లల చదువులు
ఇంటి అవసరాలు
వృద్ధ తల్లిదండ్రుల మందులు
అన్నీ ఆ ఒక్క జీతానికే
ఎదురుచూశాయి.

అయినా
"ఇంకా కావాలి" అన్న ఆశ
మనిషిని పరుగులు పెట్టించింది
సి.టి.సి అంకెల మాయలో
రేపటి సంపాదనను ఈ రోజే ఖర్చు
చేయించింది.

కొత్త వస్తువులు ఇంటికొచ్చాయి
కానీ మనశ్శాంతి రాలేదు
ఈ.ఎం.ఐల కాగితాలు పెరిగాయి
కానీ నిద్ర మాత్రం తగ్గిపోయింది.

ఒక ఉదయం
ఎప్పటిలాగే కార్యాలయానికి వెళ్లినవాడు
సాయంత్రానికి ఉద్యోగం లేని
వాడయ్యాడు
నిన్నటి వరకు అవసరమైన మనిషి
ఈ రోజు సంఖ్యగా మిగిలిపోయాడు.
అప్పుడు తెలిసింది

చేతిలో మిగిలిన పొదుపే
నిజమైన మిత్రమని
కష్టకాలంలో ఆదుకునేది
ఆర్భాటం కాదని
దాచుకున్న రూపాయేనని.

ఒక రూపాయి వెనుక
తండ్రి చెమట కథ ఉంటుంది
ఒక పొదుపు వెనుక
తల్లి త్యాగ గాథ ఉంటుంది.

అది కాగితం కాదు
కుటుంబం నమ్మకం
అది నాణెం కాదు
రేపటి భరోసా.

అందుకే
పక్కింటి వెలుగులు చూసి
మన ఇంటి ప్రశాంతతను కోల్పోవద్దు
చూపుల కోసం జీవిస్తూ
మనసును అప్పుల్లో ముంచొద్దు.

జీవితం నేర్పిన సత్యం ఒక్కటే
సంపాదన శాశ్వతం కాదు
పదవి శాశ్వతం కాదు
పరిస్థితులు కూడా శాశ్వతం కాదు.

కానీ
మితమైన ఖర్చు
సమయానికి చేసిన పొదుపు
సంతృప్తితో నిండిన మనసు
ఎలాంటి తుఫాను వచ్చినా
మనిషిని నిలబెడతాయి.

ఎందుకంటే
ఈ రోజు జీతం
రేపు ఉంటుందో లేదో తెలియదు
కానీ ఈ రోజు దాచిన రూపాయి
రేపు మన పక్కనే నిలుస్తుంది.

!అదే రేపటి భరోసా!

డాక్టర్ విశ్వేశ్వరరావు కొణపల
రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్
9640687608

# కేజీహెచ్‌లో కృత్రిమ మేధ అమలు తీరు అద్భుతం



### ప్రపంచ బ్యాంక్ ఉపాధ్యక్షుడు జోహన్నెస్ జుట్ .. ఏఐ ఆధారిత మాతా, శిశు సంరక్షణ సేవలపై ప్రశంసలు

**విశాఖపట్నం, జూన్ 22, జయ జయహే :**

వైద్య సేవల్లో డిజిటల్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సును వినియోగిస్తున్న తీరుపై ప్రపంచ బ్యాంక్ దక్షిణాసియా ప్రాంత ఉపాధ్యక్షుడు జోహన్నెస్ జుట్ సంతృప్తి వ్యక్తం చేశారు. కేజీహెచ్, ఆంధ్ర మెడికల్ కాలేజీలో అమలవుతున్న ఈ వినూత్న కార్యక్రమాలు ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్, ఆంధ్ర మెడికల్ కాలేజీని సోమవారం ఆయన సందర్శించారు. ఈ పర్యటనలో రాష్ట్ర సెకండరీ హెల్త్ డైరెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ కె. పద్మావతి, ప్రపంచ బ్యాంక్ హెల్త్ టీమ్ ప్రతినిధి అమిత్ నాగరాజ్, విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ళ విద్యాధరి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు, కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బి.వి. రమణ, డిప్యూటీ సూపరింటెండెంట్, డా. డి. రాధకృష్ణన్, డి. సీఎస్ ఆరఎంఓ డాక్టర్ కుమార్, డీసీహెచఎస్ డాక్టర్ నరేంద్ర సింగ్, అడ్మినిస్ట్రేటర్ డా. బి. కిరణ్ కుమార్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎమ్. సంధ్యా దేవి అతిథులకు స్వాగతం పలికి, ఆంధ్ర మెడికల్ కాలేజీ, కేజీహెచ్ శతాబ్ద కాల చరిత్ర, వైద్య సేవలు, వైద్య విద్య, పరిశోధన రంగాల్లో సాధించిన విజయాలు, ఆధునిక వైద్య రంగంలో తీసుకొచ్చిన వినూత్న ఆవిష్కరణలను వివరించారు. అనంతరం పీడియాట్రిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ బి.ఎస్. చక్రవర్తి, గైనకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఉషా ప్రసాద్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా గర్భిణీ స్త్రీలలో ప్రసవానికి ముందు శిశువుల ఆరోగ్య పరిస్థితి, గుండె వేగాన్ని డిజిటల్ ఫీటల్ మానిటరింగ్ ద్వారా ఎలా పర్యవేక్షిస్తున్నారో ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సాంకేతికత ద్వారా పుట్టబోయే బిడ్డకు ప్రమాద సూచనలు ఉంటే ముందుగానే గుర్తించి తక్షణ చికిత్స అందించడం ద్వారా శిశువును సురక్షితంగా కాపాడవచ్చని తెలిపారు. దీనివల్ల శిశు మరణాల రేటుతో పాటు మాతృ మరణాల రేటు ను కూడా గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ప్రజెంటేషన్ల అనంతరం అధికారుల బృందం నేరుగా గైనకాలజీ విభాగంలోని లేబర్ రూమ్ కాంప్లెక్స్, మెటర్నల్ ఐసీయూను సందర్శించింది. అక్కడ ప్రస్తుతం వినియోగంలో ఉన్న ఏఐ ఆధారిత డిజిటల్ ఫీటల్ మానిటరింగ్ వ్యవస్థ, రియల్ టైమ్ అలర్ట్ సిస్టమ్, ఏఐ డయాగ్నోస్టిక్ పరికరాల పనితీరును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేజీహెచ్ పరిపాలనా విభాగాన్ని, ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్న ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎమ్. సంధ్యా దేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి, ప్రసూతి, గైనకాలజీ, పీడియాట్రిక్స్ విభాగాల వైద్య బృందాలను ప్రత్యేకంగా అభినందించి, వారి సేవలకు ధన్యవాదాలు తెలిపారు.

# నేడు విశాఖలో ఏపీ శాసనసభ పిటిషన్స్ కమిటీ పర్యటన

**విశాఖపట్నం, జూన్ 22, జయ జయహే**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ పిటిషన్స్ కమిటీ మంగళవారం విశాఖపట్నం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. కమిటీ 23న ఉదయం 10 గంటలకు కమిటీ వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో సమావేశమై ప్రజా పిటిషన్లకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించనుందని పేర్కొన్నారు. ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ శాఖకు సంబంధించిన ఏపీఐఐసీ భూవివాదాలు, గాజువాక అపారెల్ పార్క్, పునరావాస కుటుంబాలకు ప్లాట్ల కేటాయింపు తదితర అంశాలపై చర్చ సాగనుందన్నారు. అనంతరం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖకు సంబంధించిన టిడిఆర్ ఆస్తులు, రోడ్డు విస్తరణ, భూసేకరణ పరిహారం అంశాలపై సమీక్ష ఉంటుందని చెప్పారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన 22-ఏ జాబితా, గృహ స్థలాల క్రమబద్ధీకరణ, నిషేధిత ఆస్తుల జాబితా నుంచి భూముల తొలగింపు అంశాలపై కూడా కమిటీ చర్చించనున్నట్లు స్పష్టం చేశారు. అదేవిధంగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేసిన పలు ఫిర్యాదుల మేరకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ శాఖ పరిధిలో జెట్టి నిర్మాణం, జి.ఓ.ఎం.ఎస్. నెం.26 అమలు అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకోనుందని పేర్కొంటూ తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఉత్వర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా ఛైరపర్సన్ కె. రఘురామ కృష్ణరాజు అధ్యక్షతన గల పిటిషన్ల కమిటీలో సభ్యులు గంటా శ్రీనివాసరావు, గురజాల జగన్మోహన్, కొణతాల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు మంగళవారం జరిగే సమావేశానికి హాజరుకానున్నట్లు అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర షెడ్యూల్ ప్రకటించారు.






## 28న పల్స్ పోలియో

### ఐదేళ్లలోపు వారందరికీ చుక్కలు వేయించాలి

### అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం, జూన్ 22, జయ జయహే**

జిల్లాలో ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. ఐదేళ్లలోపు ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా ప్రతి ఒక్కరికీ పోలియో చుక్కలు వేయించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమం ఏర్పాట్లపై సోమవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 28న బూత్‌ల ద్వారా పోలియో చుక్కలు వేయాలని, అనంతరం జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటి సందర్శనల ద్వారా మిగిలిపోయిన చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 0-5 సంవత్సరాల వయస్సు గల 1,89,712 మంది చిన్నారులను లక్ష్యంగా నిర్ధారించినట్లు తెలిపారు. కార్యక్రమం నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా 1,062 పోలియో బూత్‌లు, 62 ట్రాన్సిట్ బూత్‌లు, 94 మొబైల్ బూత్‌లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇంటింటి సర్వే కోసం 2,004 ప్రత్యేక బృందాలు, 4,518 మంది వ్యాక్సినేటర్లు, 120 మంది సూపర్‌వైజర్లు విధులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్ సమావేశాలు నిర్వహించి, విద్యాశాఖ సిబ్బంది సహకారంతో 0-5 ఏళ్ల పిల్లలను గుర్తించి బూత్‌లకు వచ్చేలా చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈఓను ఆదేశించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు బూత్‌ల నిర్వహణతో పాటు గృహ సందర్శన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేలా చూడాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ద్వారా గోడలపై వ్రాతలు, చాటింపులు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో ట్రాన్సిట్ బూత్‌లు ఏర్పాటు చేసి ప్రయాణంలో ఉన్న చిన్నారులకు కూడా పోలియో చుక్కలు వేయాలని ఆదేశించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ లూసి, డిప్యూటీ డీఎం అండ్ హెచఓ డాక్టర్ రోణంకి రమేష్ , వివిధ శాఖల అధికారులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## పోర్ట్ చైర్మన్‌ను కలిసిన దక్షిణ ఎమ్మెల్యే వంశీ కృష్ణ

**విశాఖపట్నం, జూన్ 22, జయ జయహే**



విశాఖపట్నం పోర్ట్ చైర్మన్ జేఎస్ బింద్రతో విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ యాదవ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పోర్ట్ నూతన చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దక్షిణ నియోజకవర్గంలోని పరిస్థితులను ఎం ఎల్ ఏ చైర్మన్ కు వివరించారు. దక్షిణ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన సహకారం పోర్ట్ నుంచి అందించాలని ఎం ఎల్ ఏ కోరారు. ఇరువురు నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చర్చించారు.



## కలెక్టర్‌కు 313 వినతులు

### ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్


**విశాఖపట్నం, జూన్ 22, జయ జయహే**

పీజీఆరఎస్ వేదికగా ప్రజల నుంచి వచ్చే వినతులకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన ఈ మేరకు మాట్లాడారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని కలెక్టర్ స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులకు అందజేశారు. ప్రతి వినతిని అధికారులు సానుభూతితో పరిశీలించి నిర్దేశిత గడువులోపు పరిష్కారం అందించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు జాప్యానికి తావివ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు సంతృప్తికరమైన పరిష్కారం అందించే దిశగా చర్యలు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన పీజీఆరఎస్ కు ప్రజలు వివిధ సమస్యలపై మొత్తం 313 వినతులు సమర్పించారు. శాఖల వారీగా ప్రజలు సమర్పించిన వినతుల్లో రెవెన్యూ శాఖకు 17, జీవీఎంసీకి 74, పోలీసు శాఖకు 19, ఇతర శాఖలకు 203 వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ తో పాటు, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఆర్డీవో ఎం. విశ్వేశ్వరనాయుడు, ఏడీసీ సత్యవేణి, పీజీఆరఎస్ నోడల్ అధికారి శేషశైలజ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అన్ని విభాగాల జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలకోసం జీవీఎంసీ అదనపు కమీషనర్‌కు వినతి

**విశాఖపట్నం (జయ జయహే)**

విశాఖపట్నం ఏఎస్ఆర్ కాలనీలో నివసిస్తున్న సుమారు 280 కుటుంబాలు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారం కోసం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు జివిఎంసి అదనపు కమిషనర్ రామమూర్తి ని కలిసి



వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాలనీలోని వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, సీసీ కెమెరాల ఏర్పాటు, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనుల పురోగతి, ఇంటింటికీ తాగునీటి కనెక్షన్లు మరియు సీసీ రోడ్ల నిర్మాణం వంటి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ కాలనీ కమ్యూనిటీ నాయకులు సతీష్, నారాయణ, సోములు, రాజు పాల్గొన్నారు. అలాగే డీబీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ నిఖిల మరియు అజయ్ కుమార్ పాల్గొని సమస్యలను వివరించారు. అదనపు కమిషనర్ రామమూర్తి సమస్యలను సానుకూలంగా పరిశీలించి సంబంధిత శాఖల ద్వారా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు



## ప్రైవేటీకరణ విధానాలను తక్షణమే నిలిపివేయాలి

**అనకాపల్లి, జూన్, 22 (జయ జయహే)**

మున్సిపల్ రంగంలో చేపడుతున్న ప్రైవేటుకరణ విధానాలను తక్షణమే నిలిపివేయాలని మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చలో విజయవాడ కు మద్దతుగా అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద సోమవారం మున్సిపల్ కార్మికులు ధర్నా చేయడం జరిగింది. అనంతరం జీవీఎం సిద్ధార్ కమిషనర్ లక్ష్మీ తులసి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మచ్చర పాయింట్లు వద్ద కార్మికులతో సంతకాల సేకరణ చేసి వాటిని కమిషనర్ కు అందజేయడం జరిగింది మా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారం చేయాలని వారు కోరడం జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంట శ్రీరామ్ మండల కన్వీనర్ కె తేలయ్య బాబు మాట్లాడుతూ అన్ని రకాల విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపాలిటీలను ప్రైవేటు సంస్థలకు అప్పగించవద్దని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .సుప్రీంకోర్టు మరి హైకోర్టు తీర్పుల ప్రకారం శాశ్వతమైన పనికి శాశ్వత వేతన ఇవ్వాలని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని మున్సిపల్ రంగంలోని వాహనాలు, లైటింగ్, తాగునీరు ,శానిటేషన్ వంటి విభాగాలను అవుట్సోర్సింగ్ చేయడం వల్ల ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని ఇది ప్రజా ప్రయోజనాల కంటే ప్రైవేటు సంస్థలకే లాభాలకు ప్రాధాన్య ఎక్కువ ఉ ంటుందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలు కార్మిక హక్కులను దెబ్బ తీస్తున్నాయని ఉద్యోగ భద్రత కరువు అవుతుందని వీరు ఆందోళన వ్యక్తం చేశారు ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేయాల్సింది పోయి సంస్థలను ప్రైవేటుకు అప్పగించడం ఆమోద యోగం కాదని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్ లో ఖాళీగా ఉన్న 120 పారిశుధ్య పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయని ఎడల రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని అవసరమైతే సమ్మెకు దిగుతామని నాయకులు స్పష్టం చేశారు ఈ నిరసన కార్యక్రమంలో వై నమః శివాయ, వై యేసు రాజు, ఎన్ అజయ్ ,ఎస్ నూకరాజు అమ్మాజీ, బుజ్జి ,సత్యవతి మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు




## పాఠశాల బస్సులు ప్రత్యేక తనిఖీలు

**అనకాపల్లి జూన్ 22 (జయ జయహే)**

అనకాపల్లి పట్టణ పరిధిలోని ఎన్టీఆర్ స్టేడియం జంక్షన్ వద్ద మోటార్ వాహనాలు తనిఖీ అధికారి లీలా ప్రసాద్ కలిసి అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం వెంకటనారాయణ పాఠశాల బస్సులను ప్రత్యేకత తనిఖీలు నిర్వహించారు. పాఠశాల బస్సులు ఫిట్నెస్ సర్టిఫికెట్లు డ్రైవింగ్ లైసెన్స్ ఫైర్ ఏక్ పె మెంట్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ కిట్టు ,ఎమర్జెన్సీ ద్వారం గుండా బయటికి వెళ్ళు ద్వారం విద్యార్థుల భద్రత సంబంధించిన ఇతర ప్రమాణాలు వీరు పరిశీలించడం జరిగింది. అదే విధంగా బస్సులలో ప్రయాణిస్తున్న విద్యార్థులు భద్రత ఏర్పాటు డ్రైవర్లు మరియు సిబ్బంది నియమ నిబంధనలు అంశాలను పరిశీలించి వారు తనిఖీలు నిర్వహించి డ్రైవర్లను, కండక్టర్లను పలు ప్రశ్నలు అడగడం జరిగింది. పాఠశాల బస్సుల విషయంలో పలు పాఠశాల యాజమాన్యాలు అలాగే డ్రైవర్లు, కండక్టర్లు విద్యార్థుల భద్రత పట్ల తగు చర్యలు తీసుకోవాలని కచ్చితంగా నియమా నిబంధనలు పాటిస్తూ తగు జాగ్రత్త వ్యవహరించాలని విద్యార్థులకు కూడా బస్సులో ప్రయాణించేటప్పుడు అవగాహన కల్పించాలని విద్యార్థులు సురక్షితంగా ప్రయాణం లక్ష్యంగా ఎటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు



## శివాలయం పుష్కరిణి అభివృద్ధికి సద్భావ టీం 40 వేలు విరాళం

**మాడుగుల,జూన్ 22,జయ జయా హే**

సిడివియం కమ్యూనిటీ ఫౌండేషన్ సద్భావ టీం వారు చోడవరం శివాలయం పుష్కరిణీ అభివృద్ధి కి 40,116 రూపాయలు విరాళంగా అందజేశారు.ఈ మొత్తాన్ని ఆలయం చైర్మన్ సురేష్ కి , ఆలయ ప్రధాన అర్చకులు చలపతి కి అందజేశారు. ఈ మొత్తంలో సద్భావ జనరల్ ఫండ్స్ తో పాటు సంఘ సభ్యులు కొప్పాక రరాజేష్, కే భగవాన్- గీతా లక్ష్మీ, పావని కూడా వ్యక్తిగత సహాయం అందజేశారు.ఈ కార్యక్రమానికి ముందుకు వచ్చిన సద్భావ సభ్యులు అందరికీ మా ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## తోటపుట్టు కల్వర్టు నిర్మాణానికి

# జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర శంకుస్థాపన

**ప్రజల అభ్యర్థనకు తక్షణ స్పందన**

**జిల్లా పరిషత్ నిధులు రూ.5 లక్షలు మంజూరు**

**ఐటీడీఏ పీవోను కలిసి రహదారి నిర్మాణంపై వినతి**

**ముంచంగిపుట్టు, జయ జయహే :**

మండలంలోని సుజనకోట పంచాయతీ తోటపుట్టు గ్రామంలో కల్వర్టు నిర్మాణానికి ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సోమవారం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. పూర్తిగా పీవీటీజీ (పి వి టి జీ ) గిరిజనులు నివసించే ఈ తండాకు ఇప్పటివరకు సరైన రహదారి సౌకర్యం లేదు. వాహనాల రాకపోకలు సాగాలన్నా, గ్రామానికి కనీస వసతులు అందాలన్నా వాగుపై కల్వర్టు నిర్మించాల్సిన అవసరం ఉందని గ్రామస్తులు చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన ఆమె జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.5 లక్షలు మంజూరు చేసి, నిర్మాణ పనులను ప్రారంభించారు.



**రహదారి లేక నిలిచిన గృహ నిర్మాణాలు**

ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ తోటపుట్టు గ్రామంలో సుమారు 80 నుంచి 100 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, ఇంతవరకు రోడ్డు లేకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం కింద ఇక్కడి గిరిజనులకు ఇళ్లు మంజూరైనప్పటికీ, నిర్మాణ సామాగ్రి (మెటీరియల్) తరలించడానికి దారి లేక ఒక్క ఇంటి నిర్మాణం కూడా పూర్తి కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఉన్న దారి గుండానైనా వాహనాలు వెళ్లేందుకు వీలుగా కల్వర్టు నిర్మించాలని ప్రజలు కోరడంతో ఈ నిధులు కేటాయించినట్లు చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తోటపుట్టు గ్రామానికి శాశ్వత రహదారి నిర్మించాలని డిమాండ్ చేశారు.

**ఐటీడీఏ పీవోకు వినతి**

కల్వర్టు శంకుస్థాపన అనంతరం చైర్‌పర్సన్ సుభద్ర పాడేరులో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి (పీవో) ఆదిత్య వర్మను కలిశారు. తోటపుట్టు గ్రామ గిరిజనులు పడుతున్న ఇబ్బందులను వివరించి, తక్షణమే ఐటీడీఏ నిధుల నుంచి రహదారి మంజూరు చేయాలని కోరారు. దీనిపై పీవో ఆదిత్య వర్మ సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జేసీఎస్ కోఆర్డినేటర్ అరబీరు జగబంధు, సుజనకోట తాజా మాజీ సర్పంచ్ వెంగడ రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు పాంగి పద్మారెడ్డి, స్థానిక ఎంపీటీసీ మజ్జి సుబ్బలక్ష్మి, వైఎస్ఆర్సీపీ పంచాయతీ ఉపాధ్యక్షుడు సీసా రాధాకృష్ణ నాయుడు, డొంబు, నారాయణ మరియు తోటపుట్టు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఓటు పట్ల అప్రమత్తంగా ఉండాలి: గంటా

**విశాఖపట్నం, జూన్ 22: (జయ జయహే)**

ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్.) పట్ల ప్రతి ఒక్క కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని మండల, వార్డు అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులతో వివిధ అంశాలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగ ఓట్లు ఉంచాలన్న వైసీపీ నాయకుల ప్రయత్నాలను అడ్డుకోవాలని, అదే సమయంలో నిజమైన ఓటు తీసేయకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రతి ఓటు ఎంత ముఖ్యమో చెబుతూ.. 1989 ఎన్నికల్లో 9 ఓట్లతో అనకాపల్లి ఎంపీగా పెతకంశెట్టి అప్పలనరసింహం ఓటమి, ఇటీవల తమిళనాడు ఎన్నికల్లో ఎమ్మెల్యే ఒకే ఒక్క ఓటుతో సాధించిన గెలుపును ఉదహరించారు. సక్రమంగా పని చేయని బి.ఎల్.ఓ.ల గురించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానన్నారు.



**30న మెగా జాబ్ మేళా**

ఈనెల 30 న పీఎం పాలెం సాంకేతిక ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళా గురించి గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని గంటా కోరారు. భీమిలిలో ఐటీ, టూరిజం, హౌసింగ్ తదితర ప్రాజెక్టులు రానున్న నేపథ్యంలో ఉద్యోగ కల్పనపై యువతలో చాలా అంచనాలున్నాయని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం అడుగుతున్న వారందరూ మెగా జాబ్ మేళా అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానమైన అన్ని కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటున్నాయని వెల్లడించారు. పార్టీ తరపున అందరూ తమ ప్రాంతాలకు చెందిన యువతకు మేళా గురించి తెలియజేయాలని అన్నారు.

**2 ఏళ్ల విజయాన్ని ఇంటింటికీ చెప్పాలి**

రెండేళ్ల కూటమి ప్రభుత్వ అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రతి ఇంటికి వివరించాలని గంటా అన్నారు. 45 రోజుల పాటు ఇంటింటికీ తిరిగి కరపత్రాలు ఇవ్వడంతో పాటు సాధించిన విజయాలు తెలియజేయాలన్నారు. ఈ నెల 25 న భీమిలి మండలం అన్నవరం గ్రామం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. పార్టీ కార్యనిర్వహక అధ్యక్షుడు నారా లోకేష్ ఈ ఇంటింటి ప్రచారం గురించి కాన్ఫరెన్స్ కాల్స్ లో పార్టీ శ్రేణులను కార్యోన్ముఖుల్ని చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రతి గ్రామంలో రోజూ 30 ఇళ్లకు వెళ్లి, రెండేళ్ల పాలనపై వారి అభిప్రాయాలు తీసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పార్టీ నేతలు చిక్కాల విజయ్ బాబు, కసిరెడ్డి దామోదరరావు, పిల్లా వెంకట్రావు, తాట్రాజు అప్పారావు, సరగడ అప్పారావు, కోరాడ రమణ, గాడు చిన్ని కుమారి లక్ష్మి, తమ్మిన సూరిబాబు, జీరు సత్యం, గొలగాని నరేంద్ర, పాసి నరసింగరావు, నాగోతి సత్యనారాయణ, గరే గుర్నాథ్, కానూరు అచ్యుతరావు, చెట్టుపల్లి సన్యాసిరావు, పంచదార్ల శ్రీనివాస్, మన్యాల సోంబాబు, లొడగల అప్పారావు, కురుమిన లీలావతి, మామిడి దుర్గారావు పాల్గొన్నారు.

# ఒకే సమస్యపై కార్యాలయం చుట్టూ తిప్పించుకోవద్దు



**వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్**

**విశాఖపట్నం, జూన్ 22, జయ జయహే :**

వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో బాధితుల నుంచి 8 వినతులు అందుకున్నారు. అర్జీలను పరిశీలించి, బాధితులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఒక సమస్య పై ఎక్కువ సార్లు కార్యాలయాల చుట్టూ తిరగకుండా చూడాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువులోగా బాధితులకు సమాచారం అందించాలని సూచించారు. ప్లానింగ్ విభాగానికి చెందిన వినతులను పరిశీలించి, బాధితులకు వివరణ ఇవ్వాలని సూచించారు. ప్రజా దర్బార్ కి మొత్తం 8 వినతులు రాగా వాటిలో ప్లానింగ్ -3, ఎస్టేట్ -1, అలాట్మెంట్ -2, ఇంజనీరింగ్,-2 చొప్పున వినతులు వచ్చాయి. సమావేశంలో కార్యదర్శి మురళీ కృష్ణ, ఓ ఎస్ డి కృష్ణ నాయక్, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# ఆర్టీసిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

**విజయవాడ (జయ జయహే)**

విజయవాడలో దాసరి నాగభూషణరావు భవన్(సి.పి.ఐ ఆఫీస్) నందు ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఎఐటియుసి అనుబంధంగా రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న స్కిల్డు/సెమీస్కిల్డు/అన్ స్కిల్డు,డెటాఎంట్రీ ఇతర విభాగాల్లోఉద్యోగులకు చెల్లించే జీతాలు మాదిరిగా ఆర్టీసిలో పనిచేస్తున్న అన్ని కేటగిరి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని, వారికి న్యాయం చేయాలని,అంతవరకు ఈఉద్యోగులందరికీ చెల్లించేజీతాలు కాంట్రాక్టర్లుద్వారా కాకుండా ఆర్టీసి మేనేజ్ మెంటే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు / ఆర్టీసీ అవుట్సోర్సింగ్ యూనియన్ గౌరవఅధ్యక్షులు యల్.నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ. కార్మికులందరికీ ఇన్సూరెన్స్ మరియు పి.ఎఫ్ , ఈ.ఎస్.ఐ లు మేనేజ్మెంట్ ద్వారా చెల్లించలేలా తగు చర్యలు తీసుకోవాలని



డిమాండ్ చేశారు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పలిశెట్టి దామోదరరావు, మాట్లాడుతూ. కార్మికులందరికీ థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ లోనికి ఉద్యోగులందరిని చేర్చి, అంతవరకు ఆర్టీసీ డిపార్ట్మెంట్ ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేసారు..ఇప్పటికే సంఘాలతో ఏర్పడిన జే.ఏ.సి తో చార్ట్ ఆఫ్ డిమాండ్లో కార్మికులకోసం డిమాండ్ చేర్చడం జరిగిందన్నారు. ఏపీపిటిడి (ఆర్టీసీ) ఔట్ సోర్సింగు ఎంప్లాయిస్ యూనియన్ ప్రచార కార్యదర్శి ఏ.అశోక్ మాట్లాడుతూ, ఆర్టీసీ రిక్రూట్మెంట్ లో భాగంగా ఔట్సోర్సింగ్ కార్మికులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ సంఘాల నేతృత్వంలో ఏర్పాటైన జె.ఏ.సి కు పూర్తి మద్దతు ఇస్తామని తెలియజేశారు. పై డిమాండ్లను పరిష్కారం కానిచో రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ధర్నాలు/ సమ్మెలు చేయుటకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు




# జిల్లా కలెక్టర్ గారు...దివ్యాంగుల సంక్షేమ శాఖ ఎక్కడండి...!

**మాపై ఇంత చిన్న చూపా...**

**ప్రతీ పనికి విజయ నగరం వెళ్లాలా...!**

అనకాపల్లి, జూన్ 22, జయ జయహే : అనకాపల్లి జిల్లా ఏర్పాటు అయినప్పటి నుంచీ దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం లేక దివ్యాంగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. తమ గోడు చెప్పుకోవడానికి సంబంధిత అధికారిక కార్యలయం ఏర్పాటు చేయాలంటూ అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రిం అందజేశారు. అనకాపల్లి జిల్లా కొత్తగా ఏర్పడినప్పటి నుండి దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయం ఏర్పాటు కాలేదు. ప్రస్తుతం ఈ శాఖ బాధ్యతలను విజయనగరం జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు నిర్వహిస్తున్నారు. దివ్యాంగులకు అవసరమైన వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, సంక కర్రలు. కృత్రిమ అవయవాలు, ఇతర సహాయక పరికరాల కోసం విజయనగరం వెళ్లవలసి వస్తోంది. దీనివల్ల రవాణా ఖర్చులు ఎక్కువ అవ్వడం, శారీరక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనకాపల్లి జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ శాశ్వత కార్యాలయం ఏర్పాటు అయ్యే వరకు అనకాపల్లి లో దివ్యాంగుల పరికరాలు నిల్వ ఉంచుటకు తాత్కాలిక భవనాన్ని అయినా కేటాయించవలసిందిగా దివ్యాంగులు కోరుతున్నారు. అలాగే సిద్దు కి ట్రై సైకిల్ మంజూరు చేయాలని, జి. సాయికుమార్ కు వీల్ చైర్ మంజు చేయాలని, విజయనగరం జిల్లా వికలాంగుల శాఖ ఏడి గారికి దరఖాస్తులు ఇవ్వడం జరిగిందని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శ బుగిడి నూక అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు.




# రైతన్న మీకోసం ఇంటింటి ప్రచారం...

**వాతావరణ మార్పులు, ఎరువుల వాడకంపై అవగాహన...**

**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్ జూన్ 23.**

కొయ్యూరు మండలంలో రైతుల సంక్షేమం, సుస్థిర వ్యవసాయమే లక్ష్యంగా 22.06.2026 నుండి 27.06.2026 వరకు రైతన్న మీకోసం ఇంటింటి ప్రచార వారోత్సవాలు జరగనున్నాయి.ఈ వారోత్సవాల్లో భాగంగా వ్యవసాయ శాఖఅధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది మండలంలోని 17 రైతు సేవా కేంద్రాల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి రైతులకు నేరుగా చెప్పనున్నారు.వర్షాలు తగ్గడం, వాతావరణం మారడం వల్ల పంటలకు వచ్చే కష్టాల గురించి రైతులకు వివరిస్తారు. నీటిని ఆదా చేసే మార్గాలు, వేరే రకం పంటలు వేసే పద్ధతి, అత్యవసరంగా చేయాల్సిన పనుల గురించి మార్గం చూపిస్తారు.ఎరువులను అంతర్జాలం ద్వారా బుక్ చేసుకునే విధానం, అందరి రైతులకు సమానంగా ఎరువులు అందడం, సకాలంలో ఎరువులు రావడం గురించి అవగాహన ఇస్తారు. నేల పరీక్ష చేయించుకుని సరిపడా ఎరువులు మాత్రమే వాడడం వల్ల ఎక్కువ పంట పండుతుందని, ఎరువుల ఖర్చు తగ్గుతుందని వివరిస్తారు.మార్కెట్‌లో అమ్మకాలు ఎక్కువగా ఉన్న లాభం తెచ్చే పంటలు, వేరే రకం పంటలు వేయడం గురించి చెబుతారు. ఇలా చేయడం వల్ల రైతు ఆదాయం పెరుగుతుందని, పంట నష్టం తగ్గుతుందని అవగాహన కల్పిస్తారు.వ్యవసాయ అధికారి పి.శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ ఇంటింటికి అవగాహన అభివృద్ధికి దారి అనే మాటతో ఈ వారోత్సవాలు చేస్తున్నాం అన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది రైతుల ఇళ్లకు వెళ్లి వ్యవసాయ సలహాలు ఇచ్చి, వారి సందేహాలు తీరుస్తారు అని చెప్పారు.అవగాహనతో ముందడుగు – సుస్థిర వ్యవసాయమే లక్ష్యం అనే మాటతో జరిగే ఈ కార్యక్రమాన్ని రైతులందరూ వాడుకోవాలని అధికారులు కోరారు.



# రోగులను వైద్యం అందించాలి

**అరకులోయ: జయ జయహే.**

అరకు వేలి మండలం బస్కి పంచాయితీ బొండగూడ గ్రామంలో మలేరియా టైఫాయిడ్ తో బాధపడుతున్న 12. మంది రోగులను చిన్నారులను సోమవారం అరకు వేలి మండలం వైస్ ఎంపీపీ కిల్లో రామన్న పాల్గొని పరామర్శించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న రోగులను వైద్య సిబ్బంది పాల్గొని వైద్యం అందించాలని ఆయన అన్నారు.

# ఆహారం వృధా చేయకండి అన్నార్తులను ఆదుకుందాం





**పెదకూరపాడు,జూన్ 22( జయ జయహే )**

ఆహారం వృధా చేయకండి మిగిలిన ఆహారంతో అన్నార్తులను ఆదుకుందామని జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడుకు చెందిన సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఆంధ్ర ప్రసాద్ నూతన గృహప్రవేశ ఫంక్షన్లో, మండలంలోని లింగంగుంట్లకు చెందిన ఎలమంచిలి బ్రహ్మతేజ, రేణుక వివాహ రిసెప్షన్లో ఆహారం మిగిలి ఉన్న సమాచారాన్ని తెలుసుకున్న జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆహారాన్ని సేకరించి పెదకూరపాడు మండలంలోని 75 తాళ్లూరు శాంతికాలని, అమరావతిలోని చెంచు కాలనీలో సోమవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ ఫంక్షన్ ఏదైనా ఆహారం మిగిలి ఉంటే 9885557987,8886777767 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని మిగిలిన ఆహారాన్ని వృధా కాకుండా పేదలకు పంచుతామని అన్నారు. ఈకార్యక్రమంలో చెరుకూరి శ్రీనివాసరావు,జన చైతన్య సమితి కోఆర్డినేటర్ వెలితోటి అనిల్ కుమార్, ప్రతినిధులు షేక్ సుభాని, కొర్రపాటి వెంకటేశ్వర్లు,షేక్ లియాఖత్ ఆలి,దాసరి కారుణ్యబాబు,గుడిపూడి అఖిల్,దాసరి విజయ్ బెన్ని బాబు తదితరులు పాల్గొన్నారు. ఇరుప్రాంతాలలో సుమారు 500 మందికి అన్నదానం చేసినట్లు జన చైతన్య సమితి ప్రతినిధులు తెలిపారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు






**విజయనగరం, జూన్ 22:**

విజయనగరం కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని "యోగ ఫర్ లైఫ్ టైమ్" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సంవత్సరపు "ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా" అనే థీమ్‌తో కార్యక్రమం నిర్వహించబడింది.ముందుగా రిజిస్ట్రార్ (ఇన్‌చార్జ్) ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా ప్రారంభోపన్యాసం లో మాట్లాడుతూ యోగా అనేది భారతీయ సంస్కృతికి ప్రతీక అని, శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.ప్రధాన వక్తగా పాల్గొన్న ప్రముఖ యోగా శిక్షకులు ఎస్.వి. కృష్ణారెడ్డి యోగా యొక్క ప్రాముఖ్యత, నిత్య జీవితంలో యోగాభ్యాసం వల్ల కలిగే ప్రయోజనాలు, ఒత్తిడి నియంత్రణ, ఆరోగ్య పరిరక్షణ మరియు జీవన నాణ్యత పెంపొందించడంలో యోగా పాత్రపై విశదీకరించారు. ప్రతి వ్యక్తి యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ మరియు ఆర్థికాధికారి ప్రొఫెసర్ ఎం. శరత్ చంద్రబాబు అధ్యక్షోపన్యాసం చేస్తూ, విద్యార్థులు, అధ్యాపకులు మరియు ఉద్యోగులు ప్రతిరోజూ యోగాభ్యాసం చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడవచ్చని పేర్కొన్నారు.కార్యక్రమానికి ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా డా. కిశోర్ పదాలా వ్యవహరించగా, విశ్వవిద్యాలయ గ్రంథపాలకులు డా. ఎస్.ఆర్. కొల్లే, డా. ఎన్.వి.ఎస్. సూర్యనారాయణ, డా. ఎం. ప్రసాద్, డా. అనిరుధ్ కుమార్, డా. బి. వెంకటేశ్వర్లు, డా. నాగేష్, డా. దివ్య, డా. ప్రామా చటర్జీ తదితర అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం యోగా శిక్షకుల ఆధ్వర్యంలో యోగా ప్రదర్శన నిర్వహించబడింది. ఈ సందర్భంగా పాల్గొన్నవారు వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామ విధానాలను అభ్యసించి యోగా పట్ల తమ ఆసక్తిని చాటుకున్నారు.

# రూ. 98.75 లక్షలతో కళ్యాణ మండపం శంకుస్థాపన

**విశాఖపట్నం, జూన్ 22, జయ జయహే**

విశాఖ దక్షిణ నియోజకవర్గం 31వ వార్డు పరిధిలోని డ్వాక్రా బజార్ భవనం వద్ద కళ్యాణ మండపం మొదటి అంతస్తు నిర్మాణ పనులకు దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.98.75 లక్షల వ్యయంతో చేపడుతున్న ఈ నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానిక ప్రజలకు వివిధ సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఎంతో ఉ పయోగపడుతుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. డిసెంబర్ నెలలోపు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన అన్ని ప్రధాన హామీలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఇప్పటికే దాదాపు 90 శాతం హామీలను అమలు చేశామని, మిగిలిన పనులను కూడా





వేగవంతంగా పూర్తి చేసి ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ దక్షిణ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి గారు,జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ,మాజీ డిప్యూటీ మేయర్ గోవింద్ రెడ్డి ,స్థానిక ఈ ఈ వెంకటేశ్వరరావు గారు, టిడిపి సీనియర్ నేత వానపల్లి గాయత్రి స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# హైమాస్ట్ లైట్ల ప్రారంభం





**ఎమ్మెల్యే వెలగపూడి జన్మదిన వేడుకలు**

**విశాఖపట్నం జయ జయహే**

విశాఖపట్నం పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ సెక్టార్--6 రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఏ బి సి పార్క్‌లో ఘనంగా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా కాలనీలో ప్రజలకు మెరుగైన వెలుతురు సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన హై మాస్ట్ లైట్లను మాజీ కార్పొరేటర్ జి. మంగవేణి పోలారావు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం కాలనీ అభివృద్ధికి మరో మైలురాయిగా నిలిచింది. అనంతరం ఏ బి సి (గాంధీ) పార్క్ ఆఫీస్ రూమ్‌లో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు. ఎమ్మెల్యే కుమారుడు వెలగపూడి ప్రతాప్ రుద్రా కేక్ కట్ చేసి, ఈ వేడుకల్లో పాల్గొన్న వారితో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సేవలను, అభివృద్ధి పట్ల వారి కట్టుబాటును పలువురు ప్రశంసించారు. ఇంకా ఈ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికెట్లు మరియు టీ-షర్ట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన . సునీల్ కుమార్ కార్పొరేటర్ జి. మంగవేణి , పోలారావు అసోసియేషన్ లీగల్ సెల్ అడ్వైజర్ అరుణ కుమారి (బీజేపీ), అసోసియేషన్ అధ్యక్షులు కె. రాము , కార్యదర్శి బి. లక్ష్మణరావు చేతుల మీదుగా పిల్లలకు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ పి. అప్పలరాజు, ఎం. సూరిబాబు, చి. చంద్రమౌళి, అల్లా భక్ష, వి.వి.వి. ప్రసాద్, డి. రజనీకాంత్, ఆర్. కేశవరావు, ఎ. రఘు, ఎం. అప్పోజీ రాజు, వి. ధనరాజు, కె. దేవి శ్రీధర్ తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## ఘనంగా బోండా జగన్ జన్మదిన వేడుకలు

### సత్కరించిన 85వవార్డ్ టిడిపి నాయకులు

**అగనంపూడి (జయ జయహే)**

వడ్లపూడి టిడిపి కార్యాలయం లో రాష్ట్ర టిడిపి కార్యదర్శి, 87 వార్డు మాజీ కార్పొరేటర్ బోండా జగన్ పుట్టినరోజు సందర్బంగా 85 వార్డు మాజీ కార్పొరేటర్ ఇంచార్జ్ ఎల్లపు ప్రసాద్ ఆధ్వర్యంలో 85 వార్డు టిడిపి నాయకులు కలిసి దుశాల్వా కప్పి ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఇల్లపు ప్రసాద్, విశాఖ పార్లమెంటరీ టిఎన్టియుసి అధికార ప్రతినిధి మాట్లాడుతూ బోండా జగన్ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి అంకితభావంతో టిడిపి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. కార్పొరేట్ గా గాజువాక జోన్ లో అత్యధిక నిధులతో 87 వార్డుని రోల్డ్ మోడల్ గా తీర్చిదిద్దారు. ఉక్కు నిర్వాసితుల సంక్షేమానికి కాలనీ అభివృద్ధికి రాజీలేని పోరాటం చేశారు. ఆయనకు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు రావాలని, ఆర్య ఆరోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమం లో 85 వార్డు తెలుగు యువత అధ్యక్షులు బండారు చందు రమేష్, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు వడ్డాది శ్రీనివాసరావు, పలక అచ్యుత్ , బి రాజన్ రాజా తులసి తెలుగు మహిళా నాయకురాలు గల్లా అనితపాల్గొన్నారు.





## సేవల నాణ్యతే సుపరిపాలనకు ప్రమాణం

### కమిషనర్ రాహుల్ మీనా

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజల సంతృప్తే అధికారుల పనితీరుకు అసలైన గీటురాయిగా నిలుస్తుందని రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వచ్చిన అర్జీలు, ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మొత్తం 37 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించినవి 14, ఇంజనీరింగ్ విభాగానికి 8, పబ్లిక్ హెల్త్‌కు 6, పింఛన్లకు 4, రెవెన్యూ విభాగానికి 3, హౌసింగ్‌కు 1, అకౌంట్స్ విభాగానికి 1 అర్జీ చొప్పున నమోదయ్యాయి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ స్వయంగా అడిగి తెలుసుకుని, కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కార మార్గాలను సూచించారు. మిగిలిన వాటిపై సమగ్రంగా పరిశీలించి నివేదికలు సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, ప్రజాస్నేహపూర్వకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని కమిషనర్ పేర్కొన్నారు. ప్రతి అర్జీని బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్దిష్ట గడువులో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సేవల నాణ్యతే సుపరిపాలనకు సరైన ప్రమాణమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా అధికారులు పనిచేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్. వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, ఎస్ఈ రీటా, సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్. మూర్తి, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ అబ్దుల్ మలిక్, రెవెన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నగరపాలక సంస్థ ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని అధికారులు తెలిపారు.






## ఇసుక దోపిడీ, షాదీఖానాపై మాజీ ఎంపీ భరత్ ఆగ్రహం

**రాజమహేంద్రవరం, జయజయహే బ్యూరో:**

రాష్ట్రంలో ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు నమోదు చేస్తోందని వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆరోపించారు. ప్రభుత్వ అన్యాయాలు, స్థానిక ప్రజాప్రతినిధుల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.అనంతరం మీడియాతో మాట్లాడిన భరత్ రామ్, నగరంలో జరిగిన కల్తీ పాల ఘటనలో బాధిత బాలలకు ప్రభుత్వం హామీ ఇచ్చిన స్థాయిలో వైద్య సహాయం అందించడం లేదన్నారు. బాధిత కుటుంబాలు లక్షల రూపాయలు ఖర్చు చేసి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రభుత్వం ఇప్పటికైనా పూర్తి వైద్య సహాయం అందించాలని డిమాండ్ చేశారు.వైసీపీ బీసీ నాయకుడు పీతా రామకృష్ణపై పీడీ యాక్ట్ ప్రయోగించడం రాజకీయ కక్షసాధింపేనని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకుని కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు.ఇన్నీస్‌పేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని, బ్యాంకు పరిపాలనపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ప్రజల డిపాజిట్ల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు.గామన్ బ్రిడ్జి సమీపంలో డ్రెడ్జింగ్ బోట్ల ద్వారా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని, దీంతో బ్రిడ్జి భద్రతతో పాటు పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోందన్నారు. దీనికి సంబంధించిన ఆధారాలను కలెక్టర్‌కు అందజేసినట్లు తెలిపారు. ముస్లిం సమాజానికి కేటాయించిన షాదీఖానా స్థలంలో నిర్మాణ పనులు నిలిచిపోయాయని, వెంటనే పనులు ప్రారంభించి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఆందోళనలు, నిరాహార దీక్షలు చేపడతామని భరత్ రామ్ హెచ్చరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.



## మెరుగైన కంటి చూపు కోసం
# ఇవి తినాల్సిందే

నేటి ఆధునిక ప్రపంచంలో, మన కంటి ఆరోగ్యాన్ని దెబ్బతీసే డిజిటల్ తెరలు, కృత్రిమ లైటింగ్లతో మనం నిరంతరం కంటిని ఇబ్బందికి గురి చేస్తూనే ఉ న్నాము. మన కళ్ళను జాగ్రత్తగా చూసుకోవడం, అవి ఉత్తమంగా పనిచేయడానికి అవసరమైన పోషకాలను అందిస్తున్నట్లు చూసుకోవడం చాలా ముఖ్యం. మన కంటి ఆరోగ్యానికి తోడ్పడటానికి ఉత్తమ మార్గాలలో ఒకటి మన భోజనంలో కొన్ని ఆహారాలను చేర్చడం ద్వారా మెరుగైన కంటి దృష్టి, కంటి ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో సహాయపడవచ్చు. క్యారెట్లు, బచ్చలికూర, సాల్మన్, బ్లూబెర్రీలు, బాదం వంటి ఆహారాలను చేర్చడం ద్వారా మీరు మీ కళ్ళకు ఉ త్తమంగా పనిచేయడానికి అవసరమైన పోషకాలను అందించవచ్చు. మీ ఆహారం ద్వారా మీ కంటి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం అనేది రాబోయే సంవత్సరాల్లో మీ దృష్టికి మద్దతు ఇవ్వడానికి సరళమైన, ప్రభావవంతమైన మార్గం.

**క్యారెట్లు:**
కంటి ఆరోగ్యం విషయానికి వస్తే.., క్యారెట్లు తరచుగా గుర్తుకు వచ్చే మొదటి ఆహారం. ఈ ప్రసిద్ధ మూల కూరగాయలలో బీటా %-% కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది విటమిన్ %ూ% ని పుష్కలంగా అందిస్తుంది. మంచి దృష్టి కోసం విటమిన్ %ూ% అవసరం. ఎందుకంటే, ఇది రెటీనా సరిగ్గా పనిచేయడానికి సహాయపడుతుంది. క్యారెట్లలో లూటిన్, జియాక్సాంటిన్ అనే రెండు యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇవి హానికరమైన నీలి కాంతి నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడతాయి.

**బచ్చలికూర:**
కంటి ఆరోగ్యం విషయానికి వస్తే బచ్చలికూర మరొక పవర్ హౌస్. ఈ ఆకుపచ్చ ఆకు లూటిన్, జియాక్సాంటిన్ తో నిండి ఉంటుంది. ఇది వయస్సు సంబంధిత మాక్యులర్ డిజెనరేషన్ నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడుతుంది. బచ్చలికూరలో విటమిన్ %జ% కూడా ఉంటుంది. ఇది యాంటీఆక్సిడెంట్, ఇది కంటిశుక్లం ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

**బ్లూబెర్రీస్:**
బ్లూబెర్రీస్ యాంటీఆక్సిడెంట్ లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడి నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడతాయి. ఈ రుచికరమైన బెర్రీలలో ఆంథోసైనిన్లు ఉ ంటాయి. ఇవి రాత్రి దృష్టిని మెరుగుపరచడానికి, కళ్ళను దెబ్బతినకుండా రక్షించడానికి సహాయపడే సమ్మేళనాలు. మీ ఆహారంలో బ్లూబెర్రీస్ ను చేర్చడం వల్ల కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

**బాదం:**
బాదం విటమిన్ %జు% యొక్క గొప్ప మూలం. ఇది యాంటీఆక్సిడెంట్. ఇది వయస్సు సంబంధిత నష్టం నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడుతుంది. విటమిన్ %జు% కంటిశుక్లం, మాక్యులర్ డిజెనరేషన్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ఇవి దృష్టిని ప్రభావితం చేసే రెండు సాధారణ కంటి పరిస్థితులు. మీ ఆహారంలో బాదంపప్పును చేర్చడం మొత్తం కంటి ఆరోగ్యానికి సహాయపడుతుంది.

## పోషకాహార లోపాల సమస్యలకు
# పనస పండుతో చెక్

**పనస పండు అనేది ఒక ఉష్ణమండల పండు. ఇది ప్రత్యేకమైన రుచి ఉండడమే కాకుండా.. అనేక ఆరోగ్య ప్రయోజనాల కారణంగా ప్రజాదరణ పొందుతోంది. తీపి రుచి, వంటలో అనేక ఉపయోగాలకు ప్రసిద్ధి చెందిన పనస పండు మొత్తం ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపరచడంలో సహాయపడే అవసరమైన పోషకాలతో కూడా నిండి ఉంటుంది. పనస వివిధ ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఈ రుచికరమైన పండ్లను మీ ఆహారంలో చేర్చడాన్ని ఎందుకు పరిగణించాలో చూద్దాం.**



**పోషకాలు పుష్కలంగా:**
పనస పండు ఒక పోషక శక్తి. ఇందులో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇది విటమిన్ సి యొక్క మంచి మూలం. ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి, ఆరోగ్యకరమైన చర్మాన్ని ప్రోత్సహించడానికి సహాయపడుతుంది. పనస పండులో విటమిన్ ఎ, పొటాషియం, మెగ్నీషియం, ఫైబర్ కూడా ఉ ంటాయి. ఇవన్నీ సరైన ఆరోగ్యానికి అవసరమైనవి.

**జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది:**
పనస పండు ముఖ్య ఆరోగ్య ప్రయోజనాల్లో ఒకటి జీర్ణ ఆరోగ్యాన్ని ప్రోత్సహించే సామర్థ్యం. పనస పండులో అధిక ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను నియంత్రించడానికి, మలబద్ధకాన్ని నివారించడానికి, ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్ ను ప్రోత్సహించడానికి సహాయపడుతుంది. ఈ పండులో సహజ ఎంజైమ్లు కూడా ఉంటాయి. ఇవి జీర్ణక్రియలో సహాయపడతాయి. అలాగే పోషక శోషణను మెరుగుపరుస్తాయి. ఇది మెరుగైన మొత్తం జీర్ణ ఆరోగ్యానికి దారితీస్తుంది.

**గుండె ఆరోగ్యానికి సహాయపడుతుంది:**
పనస అనేది గుండెకు ఆరోగ్యకరమైన పండు. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ఇందులో సంతృప్త కొవ్వు, కొలెస్ట్రాల్ తక్కువగా ఉంటాయి. ఇది ఆరోగ్యకరమైన హృదయాన్ని కాపాడుకోవాలనుకునే వారికి అద్భుతమైన ఎంపిక. పనసలోని పొటాషియం కంటెంట్ రక్తపోటును నియంత్రించడానికి, హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కూడా సహాయపడుతుంది.

**బరువు నిర్వహణలో సహాయపడుతుంది:**
బరువు తగ్గడం లేదా బరువు నిర్వహణ ఆహారంలో పనస ఒక గొప్ప అదనంగా ఉంటుంది. ఇందులో కేలరీలు తక్కువగా ఉంటాయి. కానీ, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది మీకు ఎక్కువ కాలం సంతృప్తిగా ఉండటానికి సహాయపడుతుంది. ఈ పండులో సంక్లిష్టమైన కార్బోహైడ్రేట్లు కూడా ఉంటాయి. ఇవి స్థిరమైన శక్తి వనరును అందిస్తాయి. ఆరోగ్యకరమైన బరువును కొనసాగించాలని కోరుకునే వారికి ఇది అద్భుతమైన ఎంపిక.

**రోగనిరోధక శక్తిని పెంచుతుంది:**
మీ ఆహారంలో పనస పండ్లను చేర్చడం మీ రోగనిరోధక శక్తిని పెంచడానికి, అనారోగ్య సమస్యల నుండి రక్షించడానికి సహాయపడుతుంది. పనస పండులో ఉండే విటమిన్ సి రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. పనసలోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలో మంటను తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ఇవి రోగనిరోధక ఆరోగ్యానికి మరింత తోడ్పడతాయి.



## రాత్రిపూట పాలలో యాలకులు, పసుపు
# కలుపుకుని తాగితే ఇన్ని లాభాలా?





**పాలలో కాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకలను దృఢంగా తయారు చేయడంలో ఎంతో సహాయం పడుతుంది. అలాగే ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. దీని వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగు పనిచేస్తుంది. చిటికెడు యాలకుల పొడి, పసుపు కలపడం వల్ల ప్రయోజనాలు కలుగుతాయి. అందుకే వీటిని గోల్డెన్ మిల్క్‌గా అభివర్ణిస్తున్నారు.**

ఈ గోల్డెన్ మిల్క్‌తో ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు తీవ్రమైన ఒత్తిడిని తగ్గిస్తాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. దీంతో పాటు పసుపు కలుపుకోవడం వల్ల ఇందులో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు శరీరానికి విశ్రాంతి అందజేస్తాయి. అంతేకాకుండా జలుబు దగ్గు వంటి సాధారణ సమస్యలను నుంచి ఉపశమనం కలుగుతుంది.

కఫంతో బాధపడేవారు ఈ యాలకుల పాలను తాగడం వల్ల సమస్య నుంచి విముక్తి పొందవచ్చు. అలాగే కీళ్ళనొప్పులు, కండరాల సమస్యలతో బాధపడే వారు కూడా ఈ పాలు తీసుకోవడం వల్ల ఎన్నో ఉపయోగలు ఉన్నాయి. గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలతో బాధపడే వారికి పసుపు, యాలకులతో చేసిన పాలు తాగడం వల్ల ఈ సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది.

ఏలకులు, పసుపు రెండూ నిద్రను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఏలకులు ఒత్తిడిని తగ్గించే యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉ ంటాయి. అయితే పసుపులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి శరీరానికి విశ్రాంతినిస్తాయి. పాలలో యాలకులు తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

ఛాతీలో పేరుకుపోయిన కఫాన్ని తొలగించడంలో కూడా ఏలకులు ఉపయోగపడతాయి. పసుపులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి కీళ్ల, కండరాల నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి. ఏలకులు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అజీర్ణాన్ని నివారిస్తుంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com